
కల్వారి ప్రేమధార
(ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక)
నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన
సంగతులను నేనెరుగుదును,
రాబోవు కాలమందు మీకు
నిరీక్షణకలుగునట్లుగా
అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని
హానికరమైనవి కావు
యిర్మీయా 29:11
జూలై - ఆగష్టు 17
విడి ప్రతి వెల రూ. 20/-
ఎడిటర్ :
Dr. యన్. జయపాల్

# చెన్నైలో కల్వరి చర్చిలో జరిగే ఆదివారపు ఆరాధనలకు ఆహ్వానము!

★ చెన్నైలోని 'కల్వరి చర్చి'లో ప్రతి ఆదివారం జరిగే ఆరాధనలలో పాల్గొని, దైవాశీస్సులు పొందండి!

★ 'కల్వరి దర్శనం' టి.వి. కార్యక్రమాల ద్వారా మీరు పొందుచున్న మేలులను తెలియజేసి, ప్రభువును మహిమపరచండి!

★ మీ ప్రార్థన అవసరతల కొరకు నేరుగా ప్రార్థించుటకు ప్రతి ఆదివారము దైవజనులు Dr.N. జయపాల్ గారు అందుబాటులో ఉంటారు!

## ఆరాధన సమయములు

| | | | |
|---|---|---|---|
| **ఉదయం** | **7:00 గం॥ల నుండి** | **9:00 గం॥ల వరకు** | ఇంగ్లీషు |
| **ఉదయం** | **9:00 గం॥ల నుండి** | **10:00 గం॥ల వరకు** | హిందీ |
| **ఉదయం** | **10:00 గం॥ల నుండి** | **12:00 గం॥ల వరకు** | తెలుగు |
| **మధ్యాహ్నం** | **12:00 గం॥ల నుండి** | **2:00 గం॥ల వరకు** | ఇంగ్లీషు-తెలుగు |
| **మధ్యాహ్నం** | **2:00 గం॥ల నుండి** | **4:00 గం॥ల వరకు** | తమిళం |



# కల్వరి ప్రేమధార

ఎడిటర్: యన్.జయపాల్ జూలై-ఆగస్టు 2017

కల్వరి 33 {ఈ పత్రిక ఉచితం కాదు, కనీస వార్షిక విరాళము రూ.120/-; ప్యాకింగ్ & పోస్టేజి రూ.30/- అదనం!} ధార 4

Vol-XX ISS-IV

Jul-Aug 2017 R.N.I. No.69868/98


## ముఖాముఖి

ప్రభువునందు ప్రియులైన 'కల్వరి ప్రేమధార' పాఠకులకు, శ్రేయోభిలాషులకు క్రీస్తు నామమున శుభమని చెప్పి వ్రాయుట!

జూలై 15, నా జీవితములో మరువలేని రోజు! అది ప్రభువు పిలుపుకు లోబడి, ఆయన సేవకు సమర్పించుకొన్న రోజు! 1971వ సంవత్సరము జూలై 15వ తారీఖున కాకినాడ నుండి మద్రాసు (చెన్నై)కు చేరిన రోజు!

అప్పటి నుండి ప్రభువు చిత్తములో నడుస్తూ, ఆయన చేతిలో తీర్చిదిద్దబడుతూ; ఆనాటి నుండి ఈనాటి వరకు ఆయన కృపలో ముందుకు సాగు చున్నాను. ఆయన సేవలో ప్రవేశించి 46 సంవత్సర ములు సంపూర్ణమైన సందర్భంగా ఈ జూలై 15న చెన్నైలో "All India Leadership Conference" జరిపించుటకు ప్రభువు సహాయము చేసెను.

పంజాబ్, ఢిల్లీ, ముంబై, ఒరిస్సా, కోల్‌కతా, ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు మరనేక స్థలముల నుండి ఇంచుమించు ఎనభై మంది దేవుని సేవకులు, నాయకులు ఈ Conferenceలో పాల్గొనిరి!

నాయకత్వము, సువార్త, కాపరి పరిచర్యలు, స్తుతి ఆరాధన, ప్రార్థన మరి ముఖ్యముగా 'మీడియా' ద్వారా ఏలాగు సువార్తను అనేకులకు అందించ వచ్చు అన్న విషయములు తెలుసుకొనుటకు ప్రభువు సహాయము చేసెను. ప్రభువు చిత్తములో ఈలాంటి Conferenceలు మరనేక చోట్ల జరిపించుటకు ప్రభువు సహాయము చేయును గాక!

2009 నుండి ఉజ్జీవ సభల ద్వారా, 2016 నుండి Get-Togethers ద్వారా, ఇప్పుడు Leadership Conferenceల ద్వారా పలు పరిచర్యలు జరిపించుటకు ప్రభువు కృపనిచ్చుచున్నాడు. ప్రార్థించండి! - ఎడిటర్

## ఈ సంచికలో....


- ★ మీ జీవము ఏపాటిది?
- ★ యోహాను వ్రాసిన మొదటి పత్రిక
- ★ కన్నీటి ప్రవక్త యిర్మీయా
- ★ నీ ధ్యానమేమిటి?
- ★ ఆయన యిచ్చు బహుమానములు
- ★ ప్రార్థనా జీవితము కలిగిన వ్యక్తి
- ★ త్రోఫిము
- ★ పరిశుద్ధాత్మ
- ★ హుల్దా ప్రవక్త్రి
- ★ లోభివి కావద్దు!
- ★ కోడి – కోడి పిల్లలు
- ★ సార్దీస్ సంఘము
- ★ ద్రాక్షావల్లి
- ★ మరి నీ సంగతేంటి?
- ★ సారెపతు విధవరాలు
- ★ నా కుమారుడా!
- ★ టి.వి. పరిచర్యలో పాలిభాగస్థులవ్వండి!

ఇంకా...ఇంకా...ఎన్నెన్నో....



*Our Only Address:*

**JAYAPAUL FOUNDATIONS**
**29, NEW COLONY ROAD,**
**VELACHERY,**
**CHENNAI-600 042.**

Phone : 044-2243 4787
Cell : (0) 98847 07779,
(0) 89 39 39 39 39
E-mail : Enquiry@jayapaul.com
Website : www.jayapaul.org

## సంపాదకీయం: మీ జీవము ఏపాటిది?

**"నేడైనను రేపైనను ఒకానొక పట్టణమునకు వెళ్ళి అక్కడ ఒక సంవత్సరముండి వ్యాపారము చేసి లాభము సంపాదింతము రండని చెప్పుకొనువారలారా, రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీ జీవమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరి వంటివారే. కనుగ ప్రభువు చిత్తమైతే మనము బ్రదికియుండి ఇది అది చేతమని చెప్పుకొనవలెను".** (యాకోబు 4:13,14)

మీరు కొంతసేపు కనబడి, అంతలో మాయమైపోవు ఆవిరి వంటివారే! ఈ లోకంలో మన జీవితం బహు అల్పమైనది! ఆవిరి మాయమైపోవునట్లు, మరణించిన వారు మరి కనబడరు. మన ఊపిరి మనలను వదిలినప్పుడు, మనమెందుకూ పనికిరాము! "నా దినములు నేతగాని నాడె కంటెను వడిగా గతించుచున్నవి" (యోబు 7:6) అని; 'పరుగు మీద పోవువాని కంటె నా దినములు త్వరగా గతించు చున్నవి' (యోబు 9:25) అని; "మనము నిన్నటివారమే, మనకు ఏమి తెలియదు భూమి మీద మన దినములు నీడవలె నున్నవి" (యోబు 8:8) అని యోబు భక్తుడు వ్రాయుచున్నాడు.

యోబు ఈ లోకంలో తన జీవితం బహు స్వల్పమైనదని గుర్తించి, ఈ లోక ఆస్తిపాస్తులపై గాని; బంధుప్రీతి, స్నేహప్రీతి మీద గాని తన మనస్సు పెట్టక; యథార్థవంతుడును, న్యాయవంతుడునై, దేవుని యందు భయభక్తులు కలిగి చెడు తనమును విసర్జించెను. ఈ లోకములో ఆస్తి కలిగినను, పోయినను దానిపై మనస్సు పెట్టక; తాను మరణించిన తరువాత జీవించెడి నిత్య జీవితము కొరకు ఎదురు చూచెను.

ఈ లోకంలో తన శరీరము ఒక మట్టికుండ లాంటిదని గుర్తించి, ఈ శరీరము చీకిపోయినను ఆత్మకు అంతము లేదని; మన్నెనది వెనుకటి వలె మంటికి చేరినను, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు వెళ్ళునని నమ్మెను. అందుకే యోబు "ఈలాగు నా చర్మము చీకిపోయిన తరువాత శరీరముతో నేను దేవుని చూచెదను" (యోబు 19:26) అని చెప్పగలిగెను.

ప్రియ మిత్రమా! ఈ లోకంలో నీ జీవితం ఎంత అల్పమైనదో గుర్తించితివా? యోబువలె పరసంబంధమైన ఆశీర్వాదములపై మనస్సు పెట్టుకొంటివా? లేక ధనవంతుని వలె 'నా ప్రాణమా, తినుము, త్రాగుము, సుఖించుము; అనేక సంవత్సరములకు నీకు కావలసిన ఆహారము సిద్ధపరచితిని' అని విఱ్ఱవీగుచున్నావా?

బైబిలులోని భక్తుడైన దావీదు “నరుని ఆయువు గడ్డివలె నున్నది. అడవి పువ్వు పూయునట్లు వాడు పూయును” (కీర్తన 103:15); “నా దినముల పరిమాణము బెత్తెడంతగా చేసియున్నావు నీ సన్నిధిని నా ఆయుష్కాలము లేనట్టే యున్నది. ఎంత స్థిరుడైనను ప్రతివాడును కేవలము వట్టి ఊపిరివలె ఉన్నాడు. మనుష్యులు వట్టి నీడవంటి వారై తిరుగులాడుదురు” (కీర్తన 39:5,6) అంటున్నాడు.

గనుకనే దావీదు ఎంత గొప్ప రాజైనను; దేవదారు మ్రానులతో కట్టబడిన ఇంటిలో నివసించుచు, రాజభోగములను అనుభవించుచు, తిని త్రాగుట యందు తన అల్ప జీవితమును వృథాపరచనొల్లక; ‘భక్తిహీనుల గుడారములో నివసించుట కంటె నా దేవుని మందిర ద్వారము నొద్ద నుండుట నా కిష్టము’ (కీర్తన 84:10) అనెను. ‘యెహోవా ప్రసన్నతను చూచుటకును, ఆయన ఆలయములో ధ్యానించు టకును, నా జీవిత కాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింపగోరు చున్నాను’ (కీర్తన 27:4) అని చెప్పగలిగెను.

యెషయా భక్తుడు మనుష్యుని జీవితము జారు నీటిబిందువు లాంటిది, ఎగసిపోవు ధూళివంటిది అంటున్నాడు. “జనములు చేదనుండి జారు బిందువుల వంటివి, జనులు త్రాసు మీది ధూళి వంటివారు” (యెషయా 40:15). అందుకే భక్తులు ఈ లోకములో మేము పరదేశులము, యాత్రికులమని నమ్మి; మరి శ్రేష్ఠమైన పరలోకము కొరకు ఎదురుచూచుచు, తమ పౌరస్థితి పరలోకంలో ఉన్నదని నమ్ముచున్నారు. భూమి మీద రేపేమి సంభవించునో తెలియదు గనుక ప్రభువు చిత్తమైతే మనము బ్రదికియుండి ఇది అది చేయుదమని చెప్పుకొనుచున్నారు.

గనుక స్నేహితులారా! యేసుప్రభువు యిచ్చు ఆత్మ రక్షణ సంపాదించుకొని, ఆయన రాజ్యము కొరకు ఎదురుచూడాలి! మీరు మార్పునొంది బిడ్డల వంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని ప్రభువు చెప్పెను. గనుక ఈ రోజే ప్రభువు యిచ్చు రక్షణ సంపాదించుకొని; ఏ రోజైనను, ఏ సమయమందైనను ఆయన సన్నిధిని చేరుటకు సిద్ధపడుదము! ఆయన రాకడ, మన ప్రాణము పోకడ సమీపముగా ఉన్నవని గుర్తించి జాగ్రత్తగా జీవించుదము! – యన్. జయపాల్


## కల్వరి ప్రేమధారల స్పైరల్ బౌండ్ బుక్స్

2013, 2014, 2015 మరియు 2016 సంవత్సరముల ‘కల్వరి ప్రేమధార’ పత్రికలు ఏ సంవత్సరానివి ఆ సంవత్సరం స్పైరల్ బౌండ్ బుక్స్‌గా (మొత్తం 4) సిద్ధంగా యున్నవి! రిజిస్టర్డ్ పోస్ట్ ఖర్చుతో పాటు **రూ. 350/- పంపి, పొందగలరు!**

మీరు M.O.లు పంపవలసిన చిరునామా :

**CALVARY, 29, New Colony Road, Velachery, Chennai - 600 042.**

బైబిలు పఠనం :

# యోహాను వ్రాసిన మొదటి పత్రిక

| | | | |
|---|---|---|---|
| *గ్రంథకర్త* | *: పరిశుద్ధుడైన యోహాను* | *అధ్యాయములు* | *: 5* |
| *కాలము* | *: క్రీ.శ. 81 - 96 కావచ్చు!* | *వచనములు* | *: 105* |
| *ముఖ్యాంశము* | *: దేవునితో సహవాసము* | *ముఖ్య వచనములు* | *: 1:3,4; 5:11-13* |

**గ్రంథ విభజన**

*1 - 3 అధ్యాయములు : తండ్రియైన దేవునితో, వెలుగైన దేవునితో సహవాసము*

*2 - 5 అధ్యాయములు : ప్రేమయైన దేవునితో, వాక్యమైన దేవునితో సహవాసము*

వృద్ధాప్యములో నున్న అపొస్తలుడైన యోహాను ఎఫెసు నుండి సకల పరిశుద్ధులకు వ్రాసిన సాధారణ పత్రిక! ప్రభువైన యేసు నామమును విశ్వసించిన వారు దేవుని కుటుంబములోని పిల్లలుగా తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు సహవాసము గలవారై (1:3) నిత్య జీవితము కలిగియుండినవారని (5:13) తెలుసు కొనుట ఈ పత్రిక ముఖ్య ఉద్దేశ్యము! వెలుగును, ప్రేమయు, జీవమునైయున్న దేవుని సహవాసము నందు ఆనందించుచు; తన చిన్న పిల్లలు అట్టి మృదు మధురమైన దైవ ప్రేమానందములో ఆనందించవలెనని వ్రాసెను.

పాపము భయంకరమైన దేవుని తీర్పుకు లోనగు సమస్యగా ఇందు ప్రస్తావించ బడలేదు. అది తండ్రి యెడల చిన్నబిడ్డ చేసిన అభ్యంతరము వలెను, దానిని ఉత్తర వాది పరిచర్య ద్వారా సులువుగా పరిష్కరించబడి, తెగిపోయిన సహవాసము పునరుద్ధ రింపబడుటకు వీలైనదిగాను చూపబడెను. పాపము తండ్రి బిడ్డల సంబంధమును త్రెంచివేయజాలదు గాని, వారి మధ్య గల సహవాసమును మాత్రమే త్రెంచివేయును.

దేవుడు వెలుగు గనుక, దేవుని పిల్లలు ఎప్పటికప్పుడు వెలుగులో తమ పాపములను కనిపెట్టి, వాటిని ఒప్పుకొని, ఒక్కసారే అర్పించిన క్రీస్తు రక్తపు విలువ ద్వారా వాటి నుండి శుద్ధి పొంది తండ్రి యొక్క సహవాసములో నిలిచియుందురు. దేవుడు ప్రేమ గనుక, ఆయన పిల్లలు ప్రేమయందు నడుచుకొనుచు, సహోదరులను ప్రేమించుదురు. వారు సహోదరులలో తండ్రిని, కుమారుడైన క్రీస్తును చూచెదరు. అప్పుడే వారు ప్రేమించగలరు. ప్రేమలేని హృదయము దేవుడు లేని హృదయము!

దేవుడు జీవమై యున్నాడు. అది నిత్య జీవము. నూతన జన్మము పొందిన ప్రతి విశ్వాసి దేవుని జీవమును పొందియుండును. దేవుని మూలముగా పుట్టినవాడు బుద్ధిపూర్వకముగా పాపమును అభ్యాసము చేయడు (3:9). దేవుడు నీతిమంతుడు (2:29). దేవుని మహిమార్థమై దేవుని బిడ్డ నీతియందు సాధకము చేసికొనును.

ఈ పత్రికలో సహవాసము, సహోదర ప్రేమ అనేవి ముఖ్యాంశములుగా వ్రాయబడినవి. ఈ అంత్య దినములలో దేవుని బిడ్డలతో సహవాసములోను, సహోదర ప్రేమలోను నిలకడగా ఉండునట్లు చూచుకొందము! – యన్. జయపాల్

## ప్రవక్తలు : కన్నీటి ప్రవక్త యిర్మీయా



యిర్మీయా అనగా 'దేవుడు ఏర్పరచిన వాడు' అని అర్థము! యిర్మీయా అనాతోతు అనే గ్రామంలో ఒక యాజకుని కుటుంబములో జన్మించెను. ఇతడు బాలుడుగా ఉన్నప్పుడే దేవుడితనిని తన సేవ కొరకు పిలిచెను. "యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను-గర్భములో నేను నిన్ను రూపింపక మునుపే నిన్నెరిగితిని, నీవు గర్భము నుండి బయలుపడక మునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని. జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని. అందుకు అయ్యో ప్రభువా నేను బాలుడనే మాటలాడుటకు నాకు శక్తి చాలదని నేననగా, యెహోవా నాకీలాగు సెలవిచ్చెను. నేను బాలుడను అనవద్దు. నేను నిన్ను పంపువారి యొద్దకు నీవు పోవలెను. నీకాజ్ఞాపించిన సంగతులన్నియు చెప్పవలెను" (యిర్మీయా 1:4-8).

యెషయా ప్రవక్త మరణించిన 60 సంవత్సరముల తరువాత యిర్మీయా సేవ ప్రారంభించెను. దేవుని ప్రజలు విశ్వాసమందు చల్లారిపోయి, హీనమైన జీవితము జీవించుచున్న సమయంలో, వారిని హెచ్చరించు పనిని దేవుడు యిర్మీయాకు అప్పగించెను. అయితే ఎంత హెచ్చరించినా, దేవునికి లోబడక తమ ఇష్టానుసారముగా జీవించి, శిక్షకు గురియగుట యిర్మీయా చూచినప్పుడు వారి కొరకు విలపించెడివాడు. 'నా జనులలో హతమైన వారిని గూర్చి నేను దివారాత్రము కన్నీరు విడుచునట్లు నా తల జలమయముగాను, నా కన్ను కన్నీళ్ల ఊటగాను ఉండును గాక' అని అనెను (యిర్మీయా 9:1).

యిర్మీయా బోధ గద్దింపులతో కూడినదే గాని, అతని హృదయము చాలా మెత్తనిది! అతని గద్దింపు అతని ప్రేమ హృదయానికి గుర్తు! దేవుడు యిర్మీయాను పిలిచి, రాతి కంటె తమ ముఖములను కఠినముగా చేసుకొన్నవారి యొద్దకు నిన్ను పంపెదను రమ్ము. నా వాక్యము వారిని కాల్చునట్లు నీ నోట వాటిని అగ్నిగాను ఈ జనులను కట్టెలనుగాను చేసెదను అనెను (యిర్మీయా 5:14). యిర్మీయా అలాగే దేవుని పక్షమున నిలబడి కఠినమైన బోధను నిర్మోహమాటంగా బోధించెడివాడు.

'ఇదేమి? మీరు జార చోర క్రియలను, నరహత్యలను చేయుచు అబద్ధ సాక్ష్యములు పలుకుచు బయలునకు ధూపము వేయుచు మీరెరుగని దేవతలను అనుసరించుచున్నారే. అయినను నా నామము పెట్టబడిన యీ మందిరములోనికి వచ్చి నా సన్నిధిని నిలుచుచు మేము విడుదల నొందియున్నామని మీరు చెప్పుదురు. ఈ హేయ క్రియలు జరిగించుటకేనా మీరు విడుదల నొందితిరి? (యిర్మీయా 7:9-10) అని హెచ్చరించెను.

అయినను మాట వినని ఆ జనులను చూచి, బహుగా కన్నీరు కార్చిన యిర్మీయా, 'విలపించు ప్రవక్త'గా పేరుపొందెను. యిర్మీయా తన శ్రమానుభవములో, ఒంటరితనములో, కన్నీరు కార్చుటలో యేసుప్రభువుకు ముంగుర్తుగా ఉన్నాడు. యూదులచే తృణీకరించబడిన, ఒంటరిగా ప్రార్థనలో గడిపిన, యెరూషలేము యొక్క స్థితిని చూచి కన్నీరు కార్చిన యేసుప్రభువును ముందుగానే యిర్మీయా చూపించెను.

యౌవన కాలంలోనే దేవునికి లోబడి, ఆయన సేవకు సమర్పించుకొనిన యిర్మీయా తన సేవలో సంతోషములు, ప్రోత్సాహములు లేకపోయినను; శ్రమలో, చెరలో ఉండవలసి వచ్చినను దేవుని విడిచిపెట్టలేదు.

ప్రియ పాఠకా! నీ బాల్య దినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము. యౌవన కాలమందు కాడిమోయుట నరునికి మేలు అన్న దేవుని వాక్యమును నీవెరుగుదువా? నీ బాల్యమును, యౌవనమును దేవునికి అప్పగించితివా? యిర్మీయా తన్ను తాను దేవునికి అప్పగించుకొనుటయే గాక, దేవుడతనిని వివాహము చేసుకొన వద్దు అని చెప్పినప్పుడు విధేయుడయ్యెను. "ఈ స్థలమందు నీకు కుమారులైనను, కుమార్తెలైనను పుట్టకుండునట్లు నీవు వివాహము చేసికొనకూడదు" (యిర్మీయా 16:2) అన్నప్పుడు సంతోషముతో అంగీకరించి, ప్రభువే తన సమస్తముగా తన జీవితమును సంపూర్ణముగా దేవునికి అప్పగించెను.

ఆలాగు ఒంటరిగా యున్న యిర్మీయా దేవుని కొరకై జీవించి, 'ఒంటరి ప్రవక్త' అని కూడా పేరుపొందెను. యిర్మీయా 40 సంవత్సరములు దేవుని ప్రవక్తగా జీవించి, చివరికి ఐగుప్తులో రాళ్ళతో కొట్టబడి, చంపబడెనని చరిత్ర చెప్పుచున్నది. నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే నాకు లాభమన్న పౌలు వలె యిర్మీయా ప్రభువు కొరకు జీవించి, చివరికి హతసాక్షిగా మరణించెను.

మనం కూడా ఈ లోకంలో అల్పకాల పాపభోగములు అనుభవించుట కంటె దేవుని కొరకు శ్రమ అనుభవించుట మేలని, లోక ప్రఖ్యాతి పొందుట కంటె క్రీస్తు కొరకు నింద పొందుట గొప్ప భాగ్యమని గుర్తించాలి! తాత్కాలికమైన ఈ జీవితము కంటె శాశ్వతమైన నిత్యజీవము ముఖ్యమని గుర్తించి, మోకరించి ప్రార్థించాలి!

– యస్. జయపాల్

పరీక్ష:

# నీ ధ్యానమేమిటి?

**"మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను, మెప్పైనను ఉండిన యెడల ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో వాటి మీద ధ్యానముంచుకొనుడి"** (ఫిలిప్పీ 4:8).

'దివారాత్రములు దేవుని వాక్యమును ధ్యానించువాడు ధన్యుడు' (కీర్తన 1:20) అని దావీదు వ్రాసినాడు. కొంతమంది వారి యొక్క వస్త్రములను గూర్చియు, ఆహారమును గూర్చియు, ఉద్యోగమును గూర్చియు, శరీర ఆశలను తీర్చుకొనుటను గూర్చియు ధ్యానించుచుందురు. అట్లు వారి హృదయమంతయు పాపపు తలంపులతో నిండియుండును.

అయితే దేవుని వాక్యము 'ఏవి సత్యమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, ఏవి పవిత్రమైనవో వాటిని ధ్యానించండి' అని హెచ్చరించుచున్నది. అపవిత్రమైన బొమ్మలు చూచినపుడు వాటిని ధ్యానించవద్దు, వాటిపై నీ మనస్సును పెట్టవద్దు! నీకొక అపవిత్రమైన తలంపు వచ్చినప్పుడు దాని మీద ధ్యానముంచవద్దు! నీ శత్రువును గురించి, నిన్ను బాధపెట్టువారి గురించి ఆలోచించవద్దు! అది నీకు మరింత వేదన కలుగజేయును. గాని దేవుని విషయములు ధ్యానించుచున్నప్పుడు నీ హృదయము ఎంతో సంతోషముగా ఉంటుంది.

నేను దేవుని వాక్యమును మరల మరల ధ్యానించునప్పుడు ప్రభువు అకస్మాత్తుగా మరొక క్రొత్త తలంపు నిచ్చుటను గమనించుచున్నాను. అటువంటి సమయములలో నా హృదయము గొప్ప సంతోషముతో నిండి, నాకు తెలియకుండానే ఏదో విలువైనది దొరికినట్టు నా అంతరంగములో ప్రభువునందు ఆనందించుచున్నాను.

నీవు దేవుని విషయములను ధ్యానించునపుడు నీ హృదయములో సమాధాన ముండును. నీవు తొణకవు! నీవు దేవుని విషయములు ధ్యానించుచూ ఉంటే; నీలో పాపపు యోచనకు స్థలము లేదు, అసూయ తలంపులకు చోటు లేదు, వ్యభిచార తలంపులు రావు!

దేవుని వాక్యము చెప్పుచున్నది–ఏవి సత్యమైనవో, ఏవి రమ్యమైనవో వాటిని ధ్యానించుడి! నీ యొక్క తలంపులు సరిగా ఉంటే, నీ ఆరోగ్యము బాగుంటుంది. నీవు దేవుని విషయములు ధ్యానించుచున్నప్పుడు నీ ముఖము చాలా కళగా ఉంటుంది. గనుక దేవుని యొక్క కార్యములను, ఆయన వాక్యమును ధ్యానించుము! అప్పుడు నీవు ఆకు వాడక, తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె ఉందువు (కీర్తన 1:2,3).

**– ఎడిటర్**

## తల్లులకు: ఆయన యిచ్చు బహుమానములు

**"కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము, గర్భఫలము ఆయన యిచ్చు బహుమానమే".** (కీర్తన 127:3)

దేవుని యందు భయము, విశ్వాసము కలిగిన స్త్రీ గర్భము ధరించినప్పుడు తరతరాల నుండి తరుముచున్న శాపము నుండి, వెంటాడే రోగముల నుండి విడుదల కొరకు దేవుని సన్నిధిలో నవమాసాలు ప్రార్థించి, యేసయ్య నామములో తన గర్భము చుట్టూ కంచె వేసుకొంటుంది. ప్రభువు ఆశీర్వాదములను సంపాదించుకొని, అందమైన, ఆరోగ్యకరమైన, ఎన్నెన్నో తలాంతులు కలిగిన బిడ్డలను పొందుకొంటుంది. ఆమె సంతానం ఒలీవ మొక్కల వలె ఉంటారు. నీటి కాలువల యొద్ద నాటబడి, నిరవంజి చెట్లు గడ్డిలో ఎదుగునట్లు వారు ఎదుగుతారు. దేవునిచేత ఉపదేశింపబడి, బలవంతుని చేతిలో బాణముల వలె తన బిడ్డలను సిద్ధపరుస్తుంది.

వెండి, బంగారములను ఎక్కడబడితే అక్కడ మనము కొనగలము గాని, బిడ్డలను కొనలేము గదా! అది గ్రహించిన తల్లి, బిడ్డలు దేవుడిచ్చే బహుమానమని గుర్తెరిగి; దేవుని వాక్యమును వారికి నేర్పుచూ, కంఠతః పెట్టిస్తూ, ఆ వాక్య ప్రకారముగా వారు పెరుగునట్లు; పెద్దవారైనప్పుడు తొలగిపోకుండా, తొట్రిల్లకుండా ఉండునట్లు బాల్యము నుండే వారిని సరైన మార్గములో నడిపిస్తుంది. వారి హృదయములో నుండి స్వాభావికంగా వచ్చే మూఢత్వమును బెత్తము ద్వారా తొలగిస్తుంది. శిక్షించుట మానదు గాని, వారు చావవలెనని కోరదు.

అతి ప్రమాదకరమైన యౌవన ప్రాయములోనికి ప్రవేశిస్తున్న బిడ్డలను ఎంతో భద్రతతో, ప్రభువు కాపుదల యందు పెంచుచూ; తన బిడ్డలకు ఒక స్నేహితురాలిగా, ఒక ఉపాధ్యాయురాలిగా, సలహాదారిగా ఉండి; అన్నివిధాలా వారికి ఆదరణగాను, తోడుగాను, సహాయకరముగాను ఉంటుంది.

వారు వివాహమునకు సిద్ధపడుచున్నప్పుడు దేవుని చిత్తమును కనిపెడుతుంది (లేవీయ 18:1-5 చదవండి!). ప్రభువునందు భయము కలిగిన వారిని, తమ పిల్లలకు జతపరిచేవారు ఎంతో ధన్యులు! బహిరంగమైన అందము ఉండి, అంతరంగ శుద్ధి లేకపోతే వారు దాంపత్య జీవితం జీవించడం చాలా కష్టం (సామెతలు 11:22). వారి యొక్క దాంపత్య జీవితం ఫలించదు. ప్రభువు చిత్త ప్రకారం పిల్లలకు జతను ఏర్పరచకపోతే వారి జీవితాలలో నెమ్మది, సమాధానము ఉండదు.

గనుక తన బిడ్డలను ఒక ఇంటివారిని చేసి, ప్రభువు చిత్తములో స్థిరపరచు వరకు ఆ తల్లి విశ్రమించదు. అటువంటి తల్లిగా నీవు, నేను ఉండాలని ప్రభువు ఆశిస్తున్నాడు!

– శ్రీమతి సులోచన పాల్

ప్రార్థన :

# ప్రార్థనా జీవితము కలిగిన వ్యక్తి

ప్రార్థనా జీవితం ఆరోగ్యకరంగా ఉండాలంటే, అది ఎంతో పవిత్రంగా ఉండాలి! పవిత్ర జీవితాన్ని సాధించుకోవాలంటే, 'నిర్దోషత్వం, పరిపూర్ణత' అనే మాటలకు ఉండే అర్థాన్ని బాగా గ్రహించాలి! పాపభూయిష్టమైన ఈ లోకంలో లెక్కకు మించిన శోధనలను ఎదుర్కొంటూ, ఎలీషా భక్తుని వలె దేవునికి ప్రార్థనలు చేస్తూ నిర్దోషంగా బ్రతకడం వీలుపడుతుందా?

'పరిపూర్ణులైన వ్యక్తుల జీవితాలను మనం జాగ్రత్తగా గమనించి చూడాలి' అని దావీదు భక్తుడు చెబుతున్నాడు. కారణం వారు ఈ జీవితంలో అత్యుత్తమమైన దానిని దేవుని నుండి స్వీకరిస్తారు, గమ్యాలను చేరుకొంటారు, ఇతరులను ప్రభావితం చేస్తారు. అందుకు కావలసిన ప్రార్థనా జీవితాన్ని మనము కలిగియుండాలి! అట్టి వ్యక్తిలో ఈ క్రింది విషయములు మనము చూడగలము!

**1. నిండుదనము కలిగియుంటాడు :** 'అంతా వాడే చూసుకొన్నాడు' అని ఎదుటివాని గురించి కొందరు చెప్పుకోవడం మనం తరచుగా వింటూ ఉంటాము! అంటే తనకు ఎదురైన సమస్యలను తానే పరిష్కరించుకొన్నాడని అర్థం! అంతేకాదు, అతని వైఖరిలో, కార్యసాధనలో మంచి సమతూకం (Well balanced) ప్రదర్శిస్తున్నాడన్న మాట! ఇదే క్రైస్తవులకు అన్వయించి చూస్తే–మనం సంపూర్ణమైన ఆధ్యాత్మిక జీవితం కలిగియున్నట్లుగా చెప్పుకోవచ్చు! ఏ కొరతా లేదు.

సంపూర్ణుడైన ఒక విశ్వాసి ప్రతిరోజు కొంత ప్రార్థనా సమయం పాటిస్తాడు, బైబిలు చదువుతాడు, తన విశ్వాస జీవితం గురించి ఇతరులకు చెబుతాడు. దేవునితో నడవడం ఒక విధిగా పాటిస్తాడు. తన రోజువారి జీవితం ఫలవంతంగా ఉండేలా చూసుకొంటాడు. నిర్దోష మానవుడు స్థిరంగా, నమ్మదగినవాడిగా ఉంటాడు. 'నేను అలా ఉన్నానా?' అని మనం ప్రశ్నించుకోవాలి! (కొలొస్స 2:9; 4:12; యాకోబు 1:4).

**2. భక్తి కలిగియుంటాడు :** 'ధర్మనిష్ఠ, యథార్థత, పవిత్రత' అనేవి భక్తికి పర్యాయ పదాలు! భక్తి కలిగియుండటం అంటే దేవుని దృష్టిలో ప్రత్యేకమైన ఘనత కలిగియుండడం! భక్తిగల క్రైస్తవుడు నిష్ఠ కలిగియుంటాడు. సమర్పించుకొన్నవాడై, యథార్థంగా ఉంటాడు. తన విశ్వాసం పట్ల నమ్మకం, దేవుని పట్ల ప్రగాఢమైన భక్తి ప్రపత్తులు కలిగియుంటాడు.

గమనించండి! ఒక వ్యక్తి భక్తి కలిగియున్నాడంటే, అతడు ఆనందానికి దూరంగా ఉండాలని కాదు. అమితమైన ఆనందం కలిగియున్న కొందరు, జీవితంలో గొప్ప అపహాస్యాన్ని కూడా అనుభవిస్తుంటారు. నేను భక్తి, యథార్థతలు కలిగియున్నానా? ప్రశ్నించుకోండి! (యోహాను 24:14; ఫిలిప్పీ 1:10; లూకా 2:25).

**3. మృదువుగా ఉంటాడు :** 'పరిపూర్ణత' అన్న హీబ్రూ మాటకు మృదువైన, మెత్తనైన అన్న అర్థం కూడా ఉంది. నెమ్మదిగల వ్యక్తి మెత్తగా మాట్లాడుతాడు. శాంత స్వభావం కలిగియుంటాడు. కీర్తనల గ్రంథకర్త ఊహించినట్టుగా ఈ వ్యక్తి పరిపూర్ణుడు. పరిస్థితులు అనుకూలించనప్పుడు ఆవేశకావేశాలకు లోను కాడు!

మృదు స్వభావుడైన క్రైస్తవుడు కర్కశంగా, దుఃఖ భోజనుడుగా ఉండడు! ఎప్పుడూ ప్రభువునే ఘనపరుస్తాడు. ప్రశ్నించుకోండి, 'నేను సహన భావం కలిగి యున్నానా?' (తీతు 3:1–3; II తిమోతి 2:2–24; ఎఫెసీ 4:32).

**4. అపవిత్రుడు కాకుండా ఉంటాడు :** ఒక ప్రార్థనా యోధుడిని తెలియ జేయడానికి శక్తివంత పదం ఒకటుంది! కళంకం లేని లేక నిష్కళంకమైన అన్న పదం! దీనికర్థం లౌకికమైన విషయాల్లో మలినం కాకుండా; పవిత్రంగా, పరిశు ద్ధంగా ఉండడం! దేవుని యెదుట నేను స్వచ్ఛంగా, పవిత్రంగా ఉన్నానా? మనల్ని మనం ప్రశ్నించుకోవాలి! (కీర్తన 119:1; యాకోబు 1:27; మత్తయి 5:8).

**5. నిజాయితీ కలిగియుంటాడు :** చక్కగా, ఎత్తుగా నిలబడిన దేన్నయినా నిటారుగా, సూటిగా నిలబడిందని అంటాము! ఇది శక్తిని సూచిస్తుంది. ఒక సందర్భంలో కీర్తనాకారుడు 'దేవా, నా హృదయం నిబ్బరంగా ఉన్నది' (కీర్తన 57:7) అంటాడు. నిజాయితీ గల వ్యక్తి శక్తిమంతుడై యుంటాడు. వ్యక్తిగత విశ్వాసాలపై అంటే తాను నమ్మినవాటిపై దృఢచిత్తం కలిగియుంటాడు. నేను నిజంగా నిజాయితీకి కట్టుబడి ఉన్నానా? అని ప్రశ్నించుకోవాలి!

**6. సామాన్యుడుగా ఉంటాడు :** సామాన్య జీవితానికి అలవాటు పడిన వ్యక్తి లౌకికమైన వస్తు వాహనాలను కోరుకోడు! పైగా వాటిని తృణీకరిస్తాడు. భౌతికమైన దృక్పథం అతనికుండదు. ఈ జీవితానికి అవసరమైన వాటితోనే అతడు తృప్తిపడతాడు. అతడి అభిరుచులు కూడా అతి సామాన్యంగానే ఉంటాయి! దేనిని అతిగా కోరుకోడు! ఒక యోగిలాంటి వాడు. ఇతరులను మెప్పించాలని ఉబలాట పడడు.



సామాన్యుడిగా ఉండడం అంటే, సగటు మానవుడిగా బ్రతకడం, మామూలుగా నిరాడంబరంగా ఉండడం. ఈ క్రింది బైబిలు వాక్యాలకు సరిపడి జీవిస్తున్నామా? ఆలోచించుకొందాం! (కీర్తన 37:37; ఫిలిప్పీ 4:5; కీర్తన 116:6; ఆది 25:27).

**– డిక్ ఈస్ట్‌మన్**

దేవుని జతపనివారము : **త్రోఫిము**

## (అపో. కార్య. 20:47; 21:29; ఫిలిప్పీ 2:27-30)

త్రోఫిము అనగా 'పోషణ గల' అని అర్థము! ఇతడు ఆసియా నుండి వచ్చెను (అపో. కార్య. 20:4). ఇతడు అన్యుడై యుండి, పౌలు సువార్త ద్వారా క్రైస్తవుడుగా మారెను. రక్షించబడిన తరువాత తన అనుభవ సాక్ష్యమిచ్చుచు, పౌలుతో కలిసి ఆయన మూడవ మిషనెరీ ప్రయాణంలో యెరూషలేము వరకు వెళ్ళెను. యెరూషలేము నందున్న సమయంలో పౌలుతో కలిసి వీధులలో తన సాక్ష్యము చెప్పుచు పౌలు సేవలో సహకరిస్తూండేవాడు!

నీవు రక్షించబడిన తరువాత నీ స్వజనులలోనికి, వీధులలోనికి వెళ్ళి; యేసుక్రీస్తులో నీవు కనుగొనిన సత్యమును బహిరంగముగా సాక్ష్యమిచ్చుచున్నావా? లేక ఇంకను రహస్య క్రైస్తవుడుగానే ఉండి, క్రీస్తును బహిరంగంగా ఒప్పుకొనుటకు భయపడుచున్నావా?

ఈ దినాల్లో అన్ని కులములు, జాతులలో కూడా రక్షించబడునట్లు ప్రభువు తన కార్యము చేయుచున్నాడు. అయితే రక్షించబడ్డవారు ప్రభువు తమకిచ్చిన రక్షణను బట్టి ఆనందిస్తున్నారు గాని, ఇంకను వారి కులములో రక్షించబడకుండా ఉన్నవారి యొద్దకు వెళ్ళి సాక్ష్యమిచ్చుటకు, వారిని ప్రభువు కొరకు సంపాదించుటకు భారము లేనివారిగా ఉన్నారు.

ఈనాడు సాక్ష్యము చెప్పమంటే అనేకులు తమ పాత రోత జీవితాన్ని వివరిస్తూ, అతిశయంతో గంటల తరబడి చెప్పుచున్నారే గాని; దుర్మార్గ స్థితిలో ఉన్న తమను ప్రభువు ఎట్లు విడిపించెనో వివరించుట లేదు. ప్రభువు వారిని రక్షించిన తరువాత, ఎట్టి జయ జీవితమును జీవిస్తున్నారో తెలియజేయుట లేదు.

సమరయ స్త్రీని ప్రభువు స్పందించిన తరువాత ఆమె ఊరిలోనికి వెళ్ళి, 'నేను చేసినవన్నియు నాతో చెప్పిన ఈయనను చూడుడి' (యోహాను 4:29) అని సాక్ష్యమిచ్చెను. ఆమె సాక్ష్యములో "యేసును చూడుడి" అన్నదే ప్రాముఖ్యమైనది! ఆమె తన పాపాలను వివరించ లేదు గాని, తన్ను విడిపించిన ప్రభువును మహిమపరచెను.

ప్రభువుచే స్వస్థపరచబడిన పుట్టు గ్రుడ్డివానిని 'నీకు ఈ దృష్టి ఏలాగు వచ్చింది? నీకు దృష్టి కలుగజేసినది ఎవరు?' అని పలు ప్రశ్నలతో పరిసయ్యులు వేధించుచుండగా; "మునుపు గ్రుడ్డివాడనై యుంటిని, ఇప్పుడు నేను చూచుచున్నాను" (యోహాను 9:25); "చీకటిలో నుండి నన్ను వెలుగులోనికి తెచ్చిన క్రీస్తు ఎంత

గొప్పవాడో చూడుడి" అన్నట్లు అతని సాక్ష్యముండెను. మన సాక్ష్యము ప్రభువును మహిమపరచునది గాను, మనవలె నశించిపోవుచున్న వారిని రక్షణలోనికి నడిపించునది గాను ఉండవలెను.

పౌలు త్రోఫిమును యూదులు తప్ప అన్యులు సమీపించని యెరూషలేము ఆలయమునకు తీసుకొని వచ్చెనని నిందమోపి, యూదులు పౌలును చంపజూచిరి (అపొ. కార్య. 21:29). త్రోఫిము అది ఎరిగియుండియు తనను కూడా చంపెదరని భయపడలేదు గాని; పౌలుతో పాటు శ్రమలను, బాధలను అనుభవించి, ప్రభువు సేవలో ముందుకు సాగుటకు నిశ్చయించుకొన్నాడు. ఆనాడు సాక్ష్యము చెప్పుట వలన ఎన్ని కష్టనష్టాలు కలిగినను, ప్రాణాపాయములు వచ్చినను భయపడక యుండిరి. అయితే ఈనాడు సాక్ష్యము చెప్పుట లాభదాయకంగా చేసుకొని, మనుష్యుల మెప్పు పొందగోరుచున్నారే గాని, దేవునిని మహిమపరచుట లేదు.

పౌలుకు ఇతడు ప్రియుడుగా ఉండెను. పౌలు చెర నుండి విడిపించబడిన తరువాత చేసిన చివరి మిషనెరీ ప్రయాణమందు పౌలుతో కలిసి ప్రయాణము చేసెను గాని, మార్గమధ్యములో రోగి ఆయెను. అందువలన పౌలు ఇతనిని మిలేతులో విడిచిపెట్టెను. రక్షింపబడిన తరువాత తన ఆత్మీయ తండ్రియైన పౌలుతో కలిసి జతపనివానిగా పనిచేయుచు; ఎన్నో కష్టములను, ప్రాణాపాయ పరిస్థితులను ఓర్చి; రోగియగునంతగా ప్రభువు సేవలో ముందుకు సాగెను (ఫిలిప్పీ 2:27-30). తరువాత ఇతడు పౌలుతో పాటు రోమా నగరానికి వెళ్లెను. చివరికి ఇతడు కూడా నీరో చక్రవర్తి ఆజ్ఞానుసారం పౌలువలె శిరచ్ఛేదన గావించబడి, హతసాక్షి ఆయెను.

దేవుని ద్రాక్షతోటలో తోటి సేవకులతో కలిసి మన సాక్ష్యము, ప్రసంగముల ద్వారా పనిచేయుటకు ఆ ప్రభువే మనకు సహాయము చేయును గాక!

- యన్. జయపాల్

## మరణమును కలుగజేయునవి!

- ✤ పాపము (రోమా 6:23)
- ✤ శరీరానుసారమైన మనస్సు (రోమా 8:5)
- ✤ లోక సంబంధమైన దుఃఖము (II కొరింథీ 7:10)
- ✤ సుఖభోగములు (I తిమోతి 5:6)
- ✤ ప్రేమ లేకపోవుట (I యోహాను 3:14)
- ✤ దేవునిని కనుగొనకపోవుట (సామెతలు 8:35,36)
- ✤ జారస్త్రీ మార్గములు (సామెతలు 5:3-5; 7:25-27)
- ✤ విశాల మార్గము (మత్తయి 7:13-14)
- ✤ అపరాధములు, పాపములు (ఎఫెసీ 2:1)
- ✤ దురాశ (యాకోబు 1:14,15)

నేర్చుకొందాం :

# పరిశుద్ధాత్మ

**"ఆయన వచ్చి పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయును".** (యోహాను 16:8)

పరిశుద్ధాత్మ పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు ఒప్పింపజేయును. పాపికి శిక్ష నరకమే గాని, ఎవరైతే యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి తమ పాపములను యేసు రక్తములో కడుగుకొంటారో వారు మరణము నుండి జీవములోనికి దాటిపోవుచున్నారు.

పరిశుద్ధాత్మ ఒక మనిషిలో పనిచేయుచున్నప్పుడు అతడు రానైయున్న తీర్పును గురించి ఒప్పింపబడతాడు. నేను పాపిని, నాకు భయంకరమైన తీర్పు ఉన్నదని గ్రహించుకొంటాడు. అదే సమయంలో పరిశుద్ధాత్మ మన దృష్టిని సిలువ వైపు మరలిస్తాడు. మన పాపములను సిలువలో మోసి; మన శిక్షను, తీర్పును భరించిన యేసుక్రీస్తు వైపు చూచినవాడు రక్షించబడతాడు. మనకు రావలసిన శిక్ష, దండన, తీర్పు యేసుక్రీస్తు కల్వరి కొండపై భరించెను. తద్వారా మనకు విడుదల యున్నది అని నమ్మినవాడు పాప క్షమాపణ పొందుతాడు.

పరిశుద్ధాత్మ మన మీదకు వచ్చినప్పుడు మనము మన పాపముల కొరకు పశ్చాత్తాపపడి, దేవుని ముందు మనమెంత అపవిత్రులముగా యున్నామో గుర్తించుకొని, మన పాపములకు రానైయున్న తీర్పును గురించి తెలుసుకొంటాము! మనకై మనము లోతుగా పశ్చాత్తాపపడి, యేసునందు విశ్వాసముంచి ఆయన సిలువ రక్తములో దాక్కోగలుగుతాము!

పరిశుద్ధాత్మను ఎదిరించుట క్షమాపణ లేని పాపము (మత్తయి 12:32). పరిశుద్ధాత్మ మన పాపములు ఒప్పింపజేస్తున్నప్పుడు ఇది ఫరవాలేదులే, ఇది పెద్ద పాపము కాదులే అని నిన్ను నీవు సమర్థించుకొని లోబడకపోవడం పరిశుద్ధాత్మను ఎదిరించుటయే!

స్తెఫను 'ముష్కరులారా, హృదయములను చెవులను దేవుని వాక్యమునకు లోబరచనొల్లని వారలారా, మీ పితరుల వలె మీరును ఎల్లప్పుడు పరిశుద్ధాత్మను ఎదిరించుచున్నారు' (అపో. కార్య. 7:51) అని హెచ్చరించెను. అవును! దేవుని ఆత్మ ప్రేరేపణలకు మనము లోబడక, పాపములను ఒప్పుకొనక, దొంగిలించిన వాటిని తిరిగి ఇచ్చివేయక, మన మనస్సాక్షిని సరిచేసుకొనక కఠినపరచుకొన్నచో పరిశుద్ధాత్మ మనలను విడిచిపోవును. నీవు ఘోరమైన తీర్పు పాలగుదువు. జాగ్రత్త సుమా!

**– యస్. జయపాల్**

## సలహాలు

★ **నమ్మక ముంచాల్సిన సమయమేది?**

అంతా ప్రశాంతంగా ఉన్నప్పుడా? అన్నిటిపై మనం గెలుస్తున్నప్పుడా? బ్రతుకే స్తుతి పాటైనప్పుడా?

కాదు! కాదెంత మాత్రమూ! అలలు ఎగసి పడేటప్పుడు, తుఫాను మబ్బులు కమ్ముకొచ్చినప్పుడు; ప్రార్థనే ఆహారం, కన్నీళ్ళే దాహమైనప్పుడు!

★ **నమ్మక ముంచాల్సిన తరుణమేది?**

మిత్రులంతా సఖ్యత చూపుతున్నప్పుడా? సౌఖ్యాలు కురిసేటప్పుడా? నేను చేసే ప్రతిదానిలో నాకు మెప్పు కలిగినప్పుడా?

కాదు, కాదెంత మాత్రమూ! అంతా నన్ను ఏకాకిని చేసినప్పుడు, ఆధారాలన్నీ కూలిపోయినప్పుడు!

★ **నమ్మక ముంచాల్సిన సమయమేది?**

ఎప్పుడో రాబోయే కాలంలో పాఠాలన్నీ నేర్చుకొన్న తరువాతా? కష్టాల పాలై ప్రార్థనలు చేసి, స్థిర విశ్వాసం పొందిన తరువాతా?

కాదు, కాదెన్నటికీ కాదు! ఇప్పుడే ఈ దైన్యంలోనే చితికిపోయి, చినిగిపోయి ధూళిలో కలిసినప్పుడే!

★ **నమ్మక ముంచాల్సిన తరుణమేది?**

ఆశలు బావుటాలై ఎగిరినప్పుడా? ఆకాశంలో కాంతి నిండినప్పుడా?

కాదు, కాదెంత మాత్రమూ! సంతోషం అడుగంటినప్పుడు, దిగులు మెడను వంచినప్పుడు; దేవుడు తప్ప మిగతాదంతా మరణం, శూన్యమైపోయినప్పుడు!

## హెచ్చరికలు

★ **ఆదాము, హవ్వలు :** తినవద్దన్న ఒక పండు తినుటను బట్టి దేవుడిచ్చిన మహిమను పోగొట్టుకొని; పాపమును, వేదనను, మరణమును తెచ్చుకొనిరి; మనకును యిచ్చిరి. (ఆది 3వ అధ్యా॥)

★ **లోతు భార్య :** వెనుకకు తిరిగి చూడవద్దు అన్న ఒక్క చిన్న ఆజ్ఞను మీరి, ఆస్తిపై ఉన్న మోజును బట్టి వెనక్కి తిరిగి చూచినందున ఉప్పు స్థంభమాయెను. తన కుటుంబమునకు శాపము తెచ్చెను. (ఆది 19వ అధ్యా॥)

★ **ఆకాను :** శపితమైన దానిని ముట్టవద్దు అన్న ఆజ్ఞను మీరి కొంచెము వెండి బంగారముల కొరకు ఆశించి తన ప్రాణమును, తన కుటుంబ సభ్యుల ప్రాణములను పోగొట్టుకొనెను. (యెహోషువ 7వ అధ్యా॥)

★ **సంసోను :** జారత్వమునకు దూరముగా పారిపోవుడి అన్న ఆజ్ఞను మీరి వేశ్యను చేరినందున తన బలమును, కన్నులను, చివరికి తన ప్రాణమును కోల్పోయెను. (న్యాయాధి 15వ అధ్యా॥)

★ **యూదా ఇస్కరియోతు :** ధనాపేక్ష సమస్త కీడులకు మూలము అన్న మాటను మరచి 30 వెండి నాణెముల కొరకు ఆశించి భ్రష్టత్వమునకు, ఆత్మహత్యకు గురియయ్యెను. (మత్తయి 27వ అధ్యా॥)

★ **దేమా :** లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమించకుడి అన్న మాటను మరచి, ఇహలోకమును ప్రేమించి; పౌలును విడిచి, నిత్య రాజ్యమును పోగొట్టుకొనెను. (II తిమోతి 4వ అధ్యా॥)

ఆజ్ఞాతిక్రమమే పాపము (I యోహాను 3:4). జాగ్రత్త!

**– ఎడిటర్**

వనితలకు :

# హుల్దా ప్రవక్త్రి

విగ్రహారాధకులైన ప్రజలను దేవుని వైపునకు త్రిప్పిన స్త్రీ ఈ హుల్దా!
(II దిన 34:22-33)

హుల్దా దైవభయము కలిగిన స్త్రీ! ఈమె సద్గుణ సంపన్నురాలు. పూర్వ కాలమందు యెహోవా దేవుడు ప్రవక్తల ద్వారా ప్రజలతో మాట్లాడేవాడు. ఆయన సెలవిచ్చిన ఆజ్ఞలను ప్రజలకును, ప్రజలు చెప్పిన మాటలను దేవునికిని చెప్పుటకు ప్రవక్తలు మధ్యవర్తులు! ఈ విషయంలో దేవుడు తన కార్యమును నెరవేర్చుకొనుటకు హుల్దా అను ప్రవక్త్రిని వాడుకొన్నాడు. ఈమె హర్హషుకు పుట్టిన తిక్వా కుమారుడును వస్త్రశాలకు పై విచారణ కర్తయునైన షల్లూము యొక్క భార్య!

యోషీయా ఎనిమిదేండ్ల వయస్సులోనే దేవునిచే ఇశ్రాయేలీయులకు రాజుగా ఏర్పాటుచేయబడి, ముప్పై సంవత్సరములు యెరూషలేమును పరిపాలించెను. యోషీయా నీతినియమములు కలిగి, విగ్రహారాధనకు దూరంగా ఉంటూ, దేవుని దృష్టికి అనుకూలముగా జీవించెను. గాని అతని తండ్రియైన ఆమోను, తాతయైన మనష్షే; వీరంతా దేవుని మరచి, అన్యదేవతలను ఆరాధించి ఆధ్యాత్మిక పతనానికి గురియైరి! అంతేకాదు, మోషే ద్వారా యెహోవా దయచేసిన ధర్మశాస్త్ర గ్రంథము నందలి శాసనములను పాటించకపోవుటచే; యెహోవాకు కోపము పుట్టించినవారై, ఆయన ఉగ్రతకు లోనైరి.

ఈ విషయము రాజు తెలుసుకొన్నప్పుడు తన వస్త్రములను చింపుకొని, భయాక్రాంతుడై జరుగబోయే సంగతిని యెహోవా యొద్ద విచారించి తెలుసు కొనుటకు తన ఉద్యోగస్థులను హుల్దా ప్రవక్త్రి యొద్దకు పంపెను (II దిన 34:22).

హుల్దా యెరూషలేము ఆలయ భవనాలకు కొద్ది దూరములో న్యాయస్థానాన్ని ఏర్పాటుచేసుకొని, దేవుని గూర్చిన సలహాలిస్తూ; దేవుడు ఆమెకు సెలవిచ్చిన విషయాలను ఉన్నది ఉన్నట్లుగా వివరించేది! అదేవిధంగా తన యొద్దకు వచ్చిన ఆ రాజోద్యోగులతో ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడని, దేవుని ఉగ్రత రాబోతుందని, దైవాజ్ఞను తిరస్కరించిన యెడల ఆ గ్రంథమందు వ్రాయబడియున్న శాపములన్నియు వారి మీదకు రప్పింప బోవుచున్నాడని వివరించి చెప్పి; విగ్రహారాధన విడిచి, ఆయన ఆజ్ఞలను గైకొనిన యెడల వారి మీదకు రాబోయే దేవుని ఉగ్రత నుండి తప్పించుకొని రక్షించబడుదురని రాజునకు వర్తమానము పంపినది.

ఈ వర్తమానము విన్న రాజు తన బట్టలు చింపుకొని, మిక్కిలి భయముతో వణకుచూ; రాజు మొదలుకొని, చిన్న చిన్న బిడ్డల వరకు దేవుని ఆజ్ఞకు లోబడి వారి మీదకు రాబోయే ముప్పు నుండి తప్పించుకొన్నారు (II దిన 34:30-33).

హుల్దా అవివాహిత కాదు, ఆమె షల్లూముకు భార్య! ఆ ఇంటికి ఇల్లాలుగా, బిడ్డలకు తల్లిగా దేవునిచే ఆశీర్వదించబడిన గృహిణి! అంతేకాదు, దేవుని సేవను బాధ్యతాసహితముగా కొనసాగించిన ప్రవక్త్రి! బైబిలులో ఇంకొక ప్రవక్త్రి కూడా ఉంది. ఆమె పేరు దెబోరా! న్యాయాధిపతులు 4వ అధ్యాయములో వ్రాయబడినట్లుగా ఈమె లప్పీదోతు భార్య! బిడ్డలకు తల్లిగా, ఆ ఇంటికి ఇల్లాలుగా ఉంటూ; ఇశ్రాయేలీయులకు నాయకురాలుగా పనిచేసి, బారాకు సహాయముతో శత్రువైన సీసెరాను ఓడించి, తన ప్రజలను రక్షించుకొన్నది.

అదేవిధముగా హుల్దా ప్రవక్త్రి కూడా దేవుడు తనకు విధించిన బాధ్యతను బహు సమర్ధతతో నిర్వర్తించినది. దేవుడు పూర్వకాలంలో ప్రవక్తల ద్వారా ప్రజలతో మాట్లాడియున్నాడు. గాని, ఇప్పుడైతే దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నేరుగా మనతో మాట్లాడుచున్నాడు. హుల్దా దేవునితో మాట్లాడి, దైవ విరుద్ధమైన దేశాన్ని దేవుని వైపునకు త్రిప్పి, ఆయన ఉగ్రత నుండి తన ప్రజలను రక్షించుకొన్నది.

మనము మన దేశము కొరకు, మన ప్రజలను రక్షించుట కొరకు ఎంతగా శ్రమపడుచున్నాము? దెబోరా, హుల్దాలు మనలాంటి స్త్రీలే! వీరు దేవుని స్వరమును విని తమ ప్రజలను నిత్య నాశనము నుండి తప్పించి, పరలోక రాజ్య వారసులుగా చేయుటకు అహర్నిశలు సేవ చేసిరి. మనమును ఆయన రాకడ కొరకు ఆత్మలను సిద్ధము చేయుచు, ఆయన మన కొరకు సిద్ధపరచు బహుమతులను, కిరీటములను పొందుకొందుము గాక!

**– తోలేటి సులక్షణమ్మ**

## వాగ్దానాలు

“మీరు అడుగుపెట్టు ప్రతి స్థలమును మీకిచ్చుచున్నాను” (యెహోషువ 1:3). క్రీస్తు కోసం మనం ఆక్రమించుకొనిన స్థలాలే కాక, ఆయన కోసం మనది అని చెప్పుకొని కాలుమోపని ‘దేవుని వాగ్దానాలు’ అనే భూములెన్నో ఉన్నాయి!

మీరు కాలు మోపే ప్రతి స్థలాన్ని మీ స్వాధీనం చేస్తున్నాను అంటూ దేవుడు వాగ్దాన భూమి సరిహద్దు రేఖల్ని గీసి మరీ చూపాడు. అయితే ఓ షరతు విధించాడు. ఇశ్రాయేలీయులు స్వయంగా ఆ దేశంలో పొడవు వెడల్పున కాలు మోపి తిరిగినంత మేరకు యిస్తానన్నాడు. కాని వారు కేవలం మూడోవంతు మాత్రమే కొలుచుకో గలిగారు. అంతకు మించి తీసుకోలేకపోయారు. మనం కూడా మన సోమరితనం వలన దేవుని ఆశీర్వాదములు పోగొట్టుకొంటున్నాము!

అందరికి :

# లోభివి కావద్దు!

**"ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదు".**

(లూకా 12:15)

'ఫిలిప్ ఫర్‌హామ్' అనే రచయిత, ఒక ఐశ్వర్యవంతుడైన పారిశ్రామికవేత్త యొక్క కథ వ్రాసాడు. అతడొక రోజు సముద్ర తీరానికి వెళ్ళి, అక్కడొక జాలరి తన పడవ ప్రక్కనే బద్ధకంగా కూర్చొనియుండడం చూసి, కలతపడి, ఆశ్చర్యంతో కూడిన ఆందోళనతో 'నీవెందుకు చేపలు పట్టడానికి వెళ్ళలేదు?' అని అడిగాడట!

'ఎందుకంటే ఈ రోజుకు సరిపోయే చేపలు పట్టేసాను గనుక' అని జాలరి బదులిచ్చాడట! 'మరి నీకు కావలసిన వాటికన్నా ఎక్కువ ఎందుకు పట్టవు?' అని ఆ ధనికుడు అడిగితే, 'వాటితో నేనేం చేయాలి?' అని అడిగాడట జాలరి! ఆ ఐశ్వర్యవంతుడు అసహనంగా 'నీవు వాటితో డబ్బు సంపాదించవచ్చు! ఆ డబ్బుతో దీనికన్నా మంచి పడవ కొనుక్కొని, ఇంకా లోతుకు వెళ్ళి మరిన్ని చేపలు పట్టవచ్చు! నైలాన్ వలలు కొనుక్కోవచ్చు! అప్పుడు ఇంకా అధికంగా చేపలు పట్టగలుగుతావు, అధికంగా ధనాన్ని ఆర్జించగలుగుతావు! త్వరలోనే కొన్ని పడవలను స్వంతం చేసుకొని నాలాగ ధనవంతుడివి అవుతావు' అని వివరించాడు.

ఆ జాలరి నెమ్మదిగా, 'అప్పుడు నేనేం చేస్తాను?' అని అడిగాడట! 'నీవు హాయిగా కూర్చొని జీవితాన్ని సంతోషంగా అనుభవించవచ్చు' అని ఆ పారిశ్రామిక వేత్త అనగానే 'మరి ఇప్పుడు నేనేం చేస్తున్నానని అనుకొంటున్నావు?' అని ప్రశ్నించాడట ఆ పేద జాలరి సముద్రము వైపు నిశ్శబ్దంగా చూస్తూ...!

మనకు విస్మయం కలుగవచ్చు! అయినా ఈ కథ ఒక ప్రాముఖ్యమైన సత్యాన్ని జ్ఞాపకం చేస్తుంది. మనం కేవలం ధనం ఆర్జించడానికే జీవిస్తే, 'మనకు సరిపోయి నంత సంపాదించామని' ఎన్నడూ అనుకోము! ఎందుకంటే ఎంత సంపాదించినా తృప్తి కలుగదు. ఇంకా ఇంకా సంపాదించాలని ఎంతో ఎంతో పనిచేస్తాము! చివరకు మనం కుప్పకూలేంత వరకు పనిచేస్తూనే ఉంటాము!

నీవెప్పుడూ పనిలో మునిగి యుంటున్నావా? సెలవు తీసుకోవడానికి కూడా ఇష్టపడడం లేదా? మనం సంతోషంగా అనుభవించడానికి కావలసినవన్నీ ఇచ్చిన దేవునిని సంపూర్ణంగా నమ్మడం నేర్చుకో!

– సెలెక్టెడ్

సందేశం :

# కోడి- కోడి పిల్లలు



**"కోడి తన పిల్లలను రెక్కల క్రింది కేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నోమారులు చేర్చుకొన వలెనని యుంటిని గాని మీరు ఒల్లక పోతిరి".** (మత్తయి 23:37)

యేసుప్రభువు అందరికీ అర్థ మయ్యేలాగున అనుదినము మన జీవితములో చూచు జంతువులను, పక్షులను, వృక్షములను మొదలగు వాటిని చూపించి అనేక పరసంబంధమైన సత్యములను తెలియజేసేవాడు. సాధారణంగా పిల్లల కోడిని మనము చూడగలము! తల్లి వెంట వెళ్ళుచున్న ఆ చిన్న కోడిపిల్లలు చూచుటకెంతో ముద్దుగా ఉండును. అయితే అవి తల్లిని విడిచిపెడితే, తల్లి మాట వినకపోతే చాలా ఆపద!

'ఇంత కాలానికి మేము గ్రుడ్ల నుండి బయటపడితిమి. తల్లి రెక్కల క్రింద నుండి బయటికి వచ్చితిమి' అని ఆనందిస్తున్న ఆ కోడి పిల్లలు దేవుని సృష్టిని చూసి పరవశిస్తూ, తమ ఆహారాన్ని తాము వెదుక్కొని తినుచుండగా; అకస్మాత్తుగా తల్లి కేక వేసి పిల్లలను పిలుచును. 'అపాయము! గ్రద్ద కంటిలో మీరు పడినారు. అది మిమ్మును ఎత్తికొనిపోవుటకు వచ్చుచున్నది. త్వరగా రండి, నా రెక్కల క్రింద చేరండి, నేను మిమ్ములను భద్రపరచెదను, ఏ అపాయము రాకుండా కాపాడెదను' అని కేకలు వేయును.

అయితే ఆ కోడి పిల్లలు కొన్నిసార్లు, 'అబ్బా! ఈ తల్లి మమ్మల్ని స్వేచ్ఛగా తిరుగనివ్వదు, మా ఇష్టమొచ్చినట్లు మమ్మల్ని ఉండనివ్వదు, మాటిమాటికి మమ్మల్ని పిలుచుచున్నది' అని విసుక్కొంటాయే గాని తల్లి ప్రేమను అర్థం చేసుకోవు! వాటికి రాబోయే అపాయాన్ని గుర్తించవు! అలాంటి అజ్ఞానంతో తల్లి పిలుపుకు లోబడక, తల్లి రెక్కల క్రిందకు రానొల్లని కోడిపిల్ల ఏ గ్రద్ద చేతనో పట్టబడి, చీల్చి చంపబడుతుంది.

ఆ తల్లి కోడి తన పిల్లల కొరకు ఎంత విలపించినా, ఆ పిల్ల నెంత ప్రేమించినా లోబడనొల్లని ఆ పిల్ల గతి నాశనమే! ఆలాగే దేవుని ప్రేమ లోబడనొల్లని వారివైపు దినమంతయు చేతులు చాచియున్నది. అవిధేయులై ఎదురాడు ప్రజల వైపు చేయి చాపి పిలుచుచున్నది. ద్రోహులైన బిడ్డలారా, నా యొద్దకు రండి, నేను మిమ్మును

రక్షించెదను అని ఎంత రోదించినను; అనేకులు ఆయన ప్రేమను గుర్తించక, లోబడనొల్లకున్నారు. 'జారత్వమునకు దూరముగా పారిపోవుడి', 'అల్పకాల పాప భోగములను ఆశించకుడి', 'లోభత్వమునకు చోటియ్యకుడి', 'నా మాట విని నా వైపు తిరుగుడి' అని యేసయ్య ఎంతగా బ్రతిమాలినా; ఇంకను ఆయన మాట విననివారు తప్పక వారి పాపములలో చిక్కుబడి, సాతానుచే చీల్చి చెండాడబడి పాతాళములో పడెదరు.

తల్లికోడి తన గ్రుడ్లను పిల్లలుగా మార్చుటకు 21 రోజులు నిద్రాహారాలు మాని, తన వెచ్చదనాన్ని యిచ్చుటకై ఆ గ్రుడ్లపై కూర్చుండి; అవి పిల్లలగు వరకు కనిపెట్టును. ఆ తరువాత ఆ పిల్లలు పెద్దవగు వరకు వాటి వెంటనే ఉంటూ, వాటికి ఏ అపాయము రాకుండా అహర్నిశలు కాపాడును. ఇదే తల్లి ప్రేమ! ఇలాంటిదే మన యేసయ్య ప్రేమ. మీరు ఈ ప్రేమను గుర్తించారా?

ఒకనాడు అలాగు ఒక తల్లికోడి తన పిల్లలను కాచుకొనుచుండగా పెద్ద అగ్ని ప్రమాదము ఏర్పడెను. తల్లికోడి కేకలు వేసి పిల్లలన్నిటిని తన రెక్కల క్రింద చేర్చుకొని భద్రపరచెను. అయితే ఈలోగా ఆ కోడి ప్రక్కనున్న గడ్డివాములు తగులబడి నందున, ఆ వేడికి ఆ కోడి తన ప్రాణమును విడిచెను గాని, తన పిల్లలను విడిచి పారిపోలేదు.

కొద్ది సేపటికి అక్కడికి వచ్చినవారు నిలుచున్నది నిలుచున్నట్లుగానే చచ్చియున్న ఆ కోడిని చూచి కర్రతో కదపగా, ఆ కోడి రెక్కల క్రింద సురక్షితంగా ఉన్న కోడి పిల్లలు బయటకు వచ్చెను. తన పిల్లల క్షేమము కొరకు ప్రాణము నిచ్చిన ఆ కోడి ప్రేమ, యేసయ్య ప్రేమను గుర్తు చేయటం లేదా? నరకాగ్ని జ్వాలలో నాశనమైపోవలసిన మనల్ని రక్షించుటకు ఆయన తన ప్రాణమును సిలువలో అప్పగించెను. ఈ ప్రేమ నీవు గుర్తించితివా? ఆయన పిలుపునకు నీవు లోబడితివా? ఆయన రెక్కల క్రిందికి నీవు వచ్చితివా? పరీక్షించుకొనుము!

– యన్. జయపాల్

## ఉల్లిపాయలో ఏముంది?

ఒక చిన్నబ్బాయి ఒక ఉల్లిపాయను తీసుకొని, దాని లోపల ఏముందో చూడాలని ఒక్కొక్క పొర, ఒక్కొక్క పొర తీసాడట! చివరికి దానిలో ఏమియు కనుగొనలేకపోయెను. అన్నీ పొరలే!

అలాగే అనేకమంది ఈ లోక ఆడంబరములలో సంతోషమును వెదకుచున్నారు. తమ జీవితమునంతా ఖర్చు పెట్టుచున్నారు. కాని ఎటువంటి సంతోషము పొందలేక పోవుచున్నారు (ప్రసంగి 2:11).

ప్రకటన సందేశం :

# సార్దీస్ సంఘము

జీవమును పోగొట్టుకొన్న సంఘము

(గత సంచిక తరువాయి....)

| | | |
|---|---|---|
| ❖ సార్దీస్ అనగా | - | **'ఆనంద నిలయము'** అని అర్థము! |
| ❖ **ప్రభువు నామము** | - | ఏడు నక్షత్రములును దేవుని యేడాత్మలును గలవాడు! |
| ❖ **చరిత్ర** | - | సంఘ సంస్కరణ పొందిన తరువాత ఉన్న సంఘము; మార్టిన్ లూథర్ కాలములో ప్రారంభించబడిన ప్రొటెస్టెంట్ సంఘము! |
| ❖ **కాలము** | - | క్రీ.శ. 1750 వరకు ఉండెను! |
| ❖ **సందేశము** | - | నీ క్రియలను నేనెరుగుదును! |
| ❖ **తప్పు** | - | నీ క్రియలు దేవుని యెదుట సంపూర్ణమైనవిగా కనబడ లేదు! |
| ❖ **మెప్పు** | - | తెల్లని వస్త్రములు అపవిత్రపరచుకొననివారు నీలో ఉన్నారు! |
| ❖ **దిద్దుబాటు** | - | నీవేలాగు ఉపదేశము పొందితివో యేలాగు వింటివో జ్ఞాపకము చేసికొని దానిని గైకొనుచు మారుమనస్సు పొందుము! |
| ❖ **హెచ్చరిక** | - | నేను దొంగవలె వచ్చెదను, నీవు జాగరూకుడవై యుండుము. నీ తెల్లని వస్త్రము కాపాడుకొనుము! |
| ❖ **బహుమానము** | - | జీవ గ్రంథము నుండి అతని పేరెంత మాత్రమును తుడుపు పెట్టక; తండ్రి యెదుట వానిని ఒప్పుకొందును! |

సార్దీస్, తాల్ రాస్ అనే 1500 అడుగుల ఎత్తుగల కొండమీద నిర్మించబడిన పట్టణము! సార్దీస్ చిత్రకళకు ప్రఖ్యాతి నొందినదిగాను; వెండి, బంగారాల గనులు కలిగినదిగాను ఉండెను. అయితే క్రీ.శ. 1700లో ఏర్పడిన భయంకర భూకంపము వలన అన్నివిధాలా నష్టపోయెను. గాని రోమా ప్రభుత్వ కాలములో మరల పుంజుకొని పేరు ప్రఖ్యాతులు పొందెను.

సార్దీస్ స్ముర్నకు ఉత్తరముగా 50 మైళ్ల దూరములో ఉన్నది. స్ముర్న, తుయతైర, ఫిలదెల్ఫియలకు వెళ్ళు మార్గాలను కలిపే కూడలి (జంక్షన్)గా ఉండి; వస్త్రాలకు, నగలకు ప్రఖ్యాతి చెందిన వ్యాపార కేంద్రముగా ఉండెను. అయితే క్రీస్తులో ఉన్న బుద్ధి విజ్ఞాన సర్వ సంపదలు కనుగొనినప్పటికి, చెప్పుకోదగినంత ప్రభావాన్ని

ఇతరులపై చూపించలేనిదిగాను; నామకార్థ స్థితిలోనికి దిగజారిన, జీవాన్ని పోగొట్టుకొన్న సంఘముగాను ఉండెను.

**ఈ సార్దీస్ సంఘమునకు ప్రభువిచ్చిన సందేశము :**



"సార్దీస్‌లో ఉన్న సంఘపు దూతకు ఈలాగు వ్రాయుము- ఏడు నక్షత్రములును దేవుని యేడాత్మలును గలవాడు చెప్పు సంగతులేవనగా – నీ క్రియలను నేనెరుగుదును. ఏమనగా, జీవించు చున్నావన్న పేరు మాత్రమున్నది గాని నీవు మృతుడవే. నీ క్రియలు నా దేవుని యెదుట సంపూర్ణమైనవిగా నాకు కనబడలేదు గనుక జాగరూకుడవై, చావనైయున్న మిగిలిన వాటిని బలపరచుము" (ప్రకటన 3:1,2).

ఏడు నక్షత్రములు సంపూర్ణ నిరీక్షణకును, ఏడు ఆత్మలు సంపూర్ణ శక్తికిని గుర్తుగా ఉన్నవి. "నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగును కలిగియుండును" (యోహాను 8:12) అని ప్రభువు చెప్పినట్లుగా పాపాంధకారములో ఉన్న మనకు నిరీక్షణా కాంతిని కలుగజేస్తున్నాడు. ఏడు ఆత్మలు పరిశుద్ధాత్మ యొక్క ఏడంతల సంపూర్ణతను కనుపరచుచున్నది.

మార్టిన్ లూథర్ కాలములో సంస్కరణ పొందిన సంఘము; అనతి కాలము లోనే నామకార్థంగా తయారై, ఆచార భక్తికి అలవాటు పడిపోయెను. బాప్తిస్మము, ప్రభువు బల్లలో పాలుపంపులు పొందుట, ఆలయానికి హాజరగుట, పాటలు పాడుట, వాక్యము చదువుట చివరికి ప్రార్థన చేయుట కూడా అలవాటుగా, ఆచారంగా మారిపోయే ప్రమాదముంది!

కారు నడపటం నేర్చుకొనేవాడు మొదట్లో బహు జాగ్రత్తగా ప్రతిదానిని పరిశీలిస్తూ, గమనిస్తూ; ఎక్కడ తిరగాలి, ఎక్కడ ఆపాలి, ఎప్పుడు వేగంగా వెళ్ళాలి, ఎప్పుడు హారన్ కొట్టాలి అని గమనిస్తూ, ఆలోచిస్తూ, అతి జాగ్రత్తగా తన ప్రయాణాన్ని సాగిస్తాడు. అయితే కారు నడపటం అలవాటైపోయిన తరువాత తనకు తెలియకుండానే అప్రమత్తంగా, ఆలోచించనవసరం లేకుండా స్టీరింగ్, గేర్, క్లచ్, యాక్సిలరేటర్, బ్రేక్ మొదలగువాటిని ఉపయోగిస్తాడు.

అలాగే అనేకులు రక్షించబడిన క్రొత్తలో పాట పాడినా, ప్రార్థన చేసినా, వాక్యం చదివినా పూర్ణ హృదయంతో భావాన్ని గ్రహిస్తూ ప్రభువును ఆరాధిస్తారు. అయితే కొంత కాలానికి భక్తికి అలవాటుపడి; ఆచారాలకు, పద్ధతలకు చోటిచ్చి నప్పుడు అంతరంగాన్ని దేవుని ఆత్మ ఆధ్వర్యానికి అప్పగించకుండానే ప్రార్థించుట, పాటలు పాడుట, వాక్యము చదువుట వంటి భక్తి ఆచారములను వెంబడిస్తారు. అట్టివారు భక్తి గలవారమని చెప్పుకొంటూ, దాని శక్తిని ఆశ్రయించని వారుగా ఉంటారు. అటువంటి ప్రమాదకరమైన చచ్చిన స్థితిలోనికి సార్దీస్ సంఘము దిగజారినది.

రోమన్ కేథలిక్ యొక్క ఆచార భక్తి నెదిరించి, 'నీతిమంతుడు విశ్వాసము ద్వారా క్రీస్తునందు జీవించును' (హబక్కూకు 2:4; రోమా 1:17) అన్న సత్యాన్ని బయలుపరచిన మార్టిన్ లూథర్ కాలములో రగుల్కొన్న ఉజ్జీవము ఆ సంఘాన్ని అభివృద్ధిలోనికి తెచ్చింది. అయితే అందమైన ఆలయాలు, చక్కటి సంగీతముతో కూడిన ఆరాధన క్రమాలు త్వరలోనే ఆచారాలుగా మారిపోయెను. ఆలయాలు ఉన్నవి గాని, ఆరాధన లేదు; సంగీతమున్నది గాని, స్తుతి లేదు; ఆర్భాటాలున్నాయి గాని, పరిశుద్ధాత్మ శక్తి లేదు. అందుకే ప్రభువన్నాడు – 'జీవించుచున్నావన్న పేరు మాత్రమున్నది గాని నీవు మృతుడవే' (ప్రకటన 3:1).

ఈ వర్తమానాన్ని చదువుచున్న ప్రియ పాఠకా! మన భక్తి నామకార్థంగా మారిపోకుండా, విరిగి నలిగిన హృదయంతో ప్రభువును ఆరాధించటం కలిగి యుండాలి! "నీ క్రియలు నా దేవుని యెదుట సంపూర్ణమైనవిగా నాకు కనబడలేదు. నీవేలాగు ఉపదేశము పొందితివో యేలాగు వింటివో జ్ఞాపకము చేసికొని దానిని గైకొనుచు మారుమనస్సు పొందుము".

నీవు జాగరూకుడవై యుండని యెడల నేను దొంగవలె వచ్చెదను. ఏ గడియను నీ మీదికి వచ్చెదనో నీకు తెలియనే తెలియదు. అయితే తమ వస్త్రములను అపవిత్రపరచుకొనని కొందరు సార్దీస్‌లో నీ యొద్ద ఉన్నారు. వారు అర్హులు గనుక తెల్లని వస్త్రములు ధరించుకొని నాతో కూడా సంచరించెదరు. జయించువాడు ఆలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనును. జీవ గ్రంథములో నుండి అతని పేరెంత మాత్రమును తుడుపు పెట్టక నా తండ్రి యెదుటను ఆయన దూతల యెదుటను అతని పేరు ఒప్పుకొందును (ప్రకటన 3:2-5) అనెను.

సంపూర్ణమైన భక్తి మనము కలిగియుండాలని ప్రభువు ఆశిస్తున్నాడు. పూర్ణ హృదయంతో మనమాయనను ప్రేమించాలని మన హృదయంలోనికి ఏ విధమైన

పాపము, లోకాశ ప్రవేశించకుండా ఎప్పటికప్పుడు మనలను మనము పరిశీలించు కోవాలి! ఏ గడియలో ప్రభువు వచ్చునో తెలియదు. ఆ దినము దొంగవలె మన మీదికి వచ్చును. గనుక మనము యెల్లవేళల సిద్ధంగా యుండాలని దేవుని వాక్యము హెచ్చరిస్తున్నది (మత్తయి 24:36).

సార్దీస్ సంఘము పరిపూర్ణతను ఆశించనందున ఆచార భక్తికి దిగజారి, చివరికి చచ్చిన స్థితికి చేరెను. భక్తిలో స్వీయతృప్తికి చోటివ్వక; ఇంకా ఇంకా క్రీస్తును యెరుగవలెనని, నేను క్రీస్తులాగా మారవలెనని, సంపూర్ణ సిద్ధి పొందవలెననే ఆశ కలిగియుండాలి (ఫిలిప్పీ 3:12-14). సార్దీస్‌లో కొందరు అట్టి ఆశ కలిగి, తమ తెల్లని వస్త్రములు అపవిత్రపరచుకొనక, తమ భక్తిని కాపాడుకొన్నారని ప్రభువన్నాడు. మనమనేకసార్లు వాళ్ళు సరిలేరు, వీళ్ళు సరిలేరు; వాళ్ళే అలా ఉన్నప్పుడు నేనెలా ఉంటే ఏమి? అని సమర్థించుకొంటాము!

అయితే నిజముగా క్రీస్తును కలిగినవాడు ఇతరులతో తనను పోల్చుకొనక, తన భక్తిని కాపాడుకొనుచు ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా ఉండటానికి ఇష్టపడతాడు. ఆనాడు యోసేపు, దానియేలులు అన్యరాజుల పరిపాలనలో ఉన్నప్పటికి; "ఇతని వలె దేవుని ఆత్మ గల మనుష్యుని కనుగొనగలమా?" (ఆది 41:38; దానియేలు 4:18; 5:11) అన్నట్లుగా ప్రత్యేకంగా ఉన్నారు.

ఈనాడు భయంకరమైన ఈ లోక పరిస్థితుల మధ్య క్రైస్తవులమని చెప్పుకొంటూ, ఎటువంటి మార్పులేనివారి మధ్య మనము జీవిస్తుండగా; నిజ క్రైస్తవుని వలె ఈ లోక మాలిన్యానికి, అల్పకాల పాప భోగానికి చోటియ్యక; ప్రభువిచ్చిన శుద్ధ హృదయాన్ని కాపాడుకోవాలి! లోకేచ్ఛలను, శరీరేచ్ఛలను జయించాలి! అట్లు జయించినవారి పేరు జీవగ్రంథములో నుండి తుడిచిపెట్టక, నా తండ్రి యెదుటను ఆయన దూతల యెదుటను ఒప్పుకొందునని మన ప్రభువు సెలవిచ్చుచున్నాడు.

గనుక అనుదినము దైవవాక్య పఠనం ద్వారా, మోకాళ్ళ ప్రార్థన ద్వారా దేవునితో సహవాసము కలిగి జీవిస్తూ, మంచి మనస్సాక్షి కాపాడుకొంటూ మనం జీవించాలి! యేసువైపు చూచుచు ముందున్న పందెములో ఓపికతో పరుగెత్తాలి!

"ఎవని పేరైనను జీవ గ్రంథములో వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్ని గంధకములతో మండు గుండములో పడవేయబడును" (ప్రకటన 20:15) అని బైబిలు హెచ్చరిస్తున్నది. గనుక ప్రభువిచ్చిన రక్షణను కాపాడుకొంటూ, ఆయన రాజ్య వారసులమగునట్లు జీవించుదము! **(సశేషం)** - యన్. జయపాల్

తెలుసుకొందాం :

# ద్రాక్షావల్లి



ఇది లతజాతికి చెందినది. ఆరు లేక ఎనిమిది అడుగులు గల కర్రలు పాతి, వాటిపై ఈ తీగెలు ప్రాకింప బడును. ఇది బహుగా ఫలించెడి చెట్టు! గుత్తులుగా గుత్తులుగా ఫలములు వ్రేలాడును. తీయదనము, పుల్లదనము సరైన పాళ్ళలో మిళితమై చాలా చక్కని రుచిని యిస్తాయి ద్రాక్షపండ్లు!

"నేను నిజమైన ద్రాక్షావల్లిని" (యోహాను 15:1) అని యేసుప్రభువు చెప్పెను. "దేవునిని మానవులను సంతోషపెట్టు నా ద్రాక్షారసమును నేనియ్యక మాని చెట్ల మీద రాజునై యుండి యిటు అటు ఊగుటకు నేను వచ్చెదనా?" (న్యాయాధి 9:13). దేవునిని, మానవులను సంతోషపెట్టు ఇది క్రీస్తు మధ్యవర్తిత్వమును చూపించు చున్నది. ఈ ద్రాక్షావల్లియగు క్రీస్తు, దేవుని యొద్ద మన కొరకు విజ్ఞాపన చేయు చున్నాడు. 'ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు' అని ప్రభువు చెప్పిన మాటలు ఆయన మన యెడల కలిగియున్న ప్రేమానుబంధాన్ని తెలియజేస్తుంది.

ద్రాక్షారసము క్రీస్తు రక్తమునకు గుర్తుగా నున్నది. మానవ పాప పరిహారము చేసి, దైవోగ్రత నుండి మనలను కాపాడి, మానవుల సర్వ పాపముల కొరకు బలియై సిలువలో తన రక్తమును కార్చిన క్రీస్తు దేవునిని సంతోషపెట్టెను. ఈ ద్రాక్షారసము ధర్మశాస్త్ర క్రియా రూపక సిద్ధాంతములను నెరవేర్చి, కృపారూపక సిద్ధాంతమును నెలకొల్పెను. ధర్మశాస్త్రోపదేశ సిద్ధాంతము తెంపి, మానవుని సంతోషపెట్టెను. ప్రాయశ్చిత్తముగా దైవోగ్రతకు ఆహుతియై దేవుని సంతోషపెట్టెను. ఇట్లు దేవునికిని, నరునికిని మధ్యవర్తి యైన క్రీస్తే ద్రాక్షావల్లి! మనమీ ద్రాక్షావల్లిని అంటిపెట్టుకొని ఉంటే ఫలిస్తాము, లేకపోతే నశిస్తాము!

"నాయందు నిలిచియుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనే గాని తనంతట తానే యేలాగు ఫలింపదో, ఆలాగే నాయందు నిలిచియుంటేనే కాని మీరును ఫలింపరు... మీరు బహుగా ఫలించుట వలన నా తండ్రి మహిమపరచబడును; ఇందువలన మీరు నా శిష్యులగుదురు" (యోహాను 15:4-8) అని ప్రభువు సెలవిచ్చుచున్నాడు.

– యన్. జయపాల్

పరిశీలించుకొందాం: # మరి నీ సంగతేంటి?

- ☛ భూ లోకమంతా దేవుని సన్నిధిని చెడిపోయినప్పుడు, నోవహు ఒక్కడే దేవుని దృష్టిలో నీతిపరుడుగా, నిందారహితుడుగా ఉన్నాడు. తద్వారా దేవుడు భూలోకాన్ని నాశనం చేసినప్పటికి; నోవహు కుటుంబాన్ని రక్షించి, వారి ద్వారా నూతన సృష్టిని కలుగజేసాడు!
- ☛ ఇశ్రాయేలీయులందరూ బయలు దేవతను పూజించుచుండగా, యెహోవా కొరకు నేనొక్కడనే రోషము గలవాడనై యున్నాను అని ఏలీయా అన్నాడు. తద్వారా 'యెహోవాయే దేవుడు' అని జనులందరూ ఒప్పుకొనునట్లు చేయగలిగాడు!
- ☛ రాజు నిలువబెట్టించిన విగ్రహానికి బబులోనులో ఉన్నవారందరూ మ్రొక్కుతున్నప్పటికి; తమ దేహములను అప్పగించి, రాజాజ్ఞను వ్యర్థపరచునట్లుగా దేవుని కొరకు నిలిచారు–షద్రకు, మేషాకు, అబేద్నెగోలు! తద్వారా ఇవ్విధముగ రక్షించుటకు సమర్థుడైన దేవుడు గాక మరి ఏ దేవుడును లేడు, ఆ దేవుని దూషించువాని ఇల్లు పెంటకుప్పగా చేయబడును అన్న రాజాజ్ఞ వచ్చుటకు కారణమయ్యారు.
- ☛ నెల రోజులు రాజుకు తప్ప మరి ఏ దేవుని వద్ద గాని, మానవుని వద్ద గాని ఏ మనుష్యుడును మనవి చేయకూడదు అన్న రాజాజ్ఞ ఉన్న సమయంలో దేవునికి ప్రార్థించుట యందు భయపడక, యథావిధిగా ముమ్మారు మోకాళ్ళూని ప్రార్థించాడు దానియేలు. తద్వారా దానియేలు దేవుడే జీవము గల దేవుడు; ఆయనే విడిపించి రక్షించువాడు అని రాజు శాసనం వ్రాయించాడు.

మరి నేడు మనం చూస్తున్న ఈ ప్రపంచంలో ఒకవైపు పాపము బహుగా విస్తరించిపోతూ ఉండగా, మరొకవైపు దేవుని వాక్యమునకు విరోధమైన చట్టాలు ప్రభుత్వాలు చేస్తుండగా; మన కొరకు తన ప్రాణమిచ్చిన యేసయ్య కొరకు సాక్షిగా నిలబడి, ఆయన శక్తిని, మహిమను నిరూపిద్దామా? – పాస్టర్. కిరణ్

**'కల్వరి దర్శనం' టి.వి. కార్యక్రమాలను మీరు వీక్షిస్తున్నారా?**

మా మ్యూజిక్, శుభవార్త, ఆరాధన ఛానల్స్ ద్వారా ప్రతిరోజు ప్రసారమౌతున్న 'కల్వరి దర్శనం' కార్యక్రమాలను తప్పక వీక్షించండి!
ఈ కార్యక్రమాలు అనేకులు చూచునట్లు ఇతరులకు కూడా తెలియజేయండి!
మీరు పొందుచున్న మేళ్ళను గూర్చి మాకు తెలియజేయండి!
ఈ కార్యక్రమాలను కొనసాగించుట కొరకు ప్రార్థించండి!
మీ విరాళములను పంపించండి!

వర్తమానం :

# సారెపతు విధవరాలు

సారెపతు–తూరు, సీదోనుల మధ్యలో ఉన్న చిన్న రేవు పట్టణము! ఆ గ్రామములో ఒక విధవరాలు భర్తను పోగొట్టుకొనుటయే గాక, బహు కష్టకాలములో ఉండెను. ఆమె పేదరికానికి, ఆ దేశంలోని కరవు మరింత దరిద్రతను సమకూర్చెను. ఆమెకున్న ఒక్కగానొక్క కుమారుడు ఇంకనూ బాలుడుగా నున్నందున, వానిని పోషించి పెద్ద చేయవలసిన భారం ఆమెపై యుండెను.

బెల్లం ఉన్నంతసేపు ఈగలు ముసిరినట్టు, ఆమె సమృద్ధిలో ఉన్నంత కాలము ఆమె బంధువులు ఆమె చుట్టూ ఉన్నారు. ఆమె దరిద్రతను చూచి ఒక్కరును ఆమె చెంతకు రాకపోయిరి. అన్నిరీతులుగాను ఒంటరితనాన్ని, కరవును ఎదుర్కొంటున్న ఆ విధవరాలిని దేవుడు చూచెను. ఆయన తండ్రి లేనివారికి తండ్రి, దిక్కు లేనివారికి దిక్కుగా ఉన్నందున; ఆమె కష్టాన్ని తీర్చుటకు, ఆమెను ఆదరించుటకు ఏలీయా వంటి ప్రవక్తను ఆమె యొద్దకు పంపదలచెను.

కెరీతు వాగు దగ్గర హాయిగా ఉదయం, సాయంత్రం రొట్టె, మాంసము తింటూ; కెరీతు వాగులోని స్వచ్ఛమైన నీరు త్రాగుచు కరవు కాలంలో కూడా సమృద్ధిగా పోషించబడుచున్న దైవజనుడైన ఏలీయాతో దేవుడు ఇట్లనెను–"నీవు సీదోను పట్టణ సంబంధమైన సారెపతు అను ఊరికి పోయి అచ్చట ఉండుము. నిన్ను పోషించుటకు అచ్చటనున్న ఒక విధవరాలికి నేను సెలవిచ్చితిని" (I రాజులు 17:8,9). ఎంత ఆశ్చర్యము! కరవులో ఉన్న ఒక విధవరాలిని పోషించుటకు, ఆకలితో ఉన్న ప్రవక్తను ప్రభువు పంపించుచున్నాడు.

సారెపతు చేరిన ఏలీయా – ఊరి గవిని యొద్ద కట్టెలు ఏరుకొంటున్న ఒక విధవరాలిని చూచి త్రాగుటకు కొంచెము నీళ్ళు ఇమ్మని అడిగెను. ఆ స్త్రీ నీళ్ళు తేబోవుచుండగా – ఒక రొట్టె ముక్కను కూడా తీసుకొని రమ్మనెను. అంతకు ముందెప్పుడూ ఆ స్త్రీ ఏలీయాను చూడలేదు. అయినను ఆయనలోని గంభీరమును, ఆయన ముఖములోని తేజస్సును చూచి; ఆయన దైవజనుడని గ్రహించెను. దీనిని బట్టి ఆ స్త్రీ దేవునియందు భయభక్తులు గల స్త్రీ అని తెలియుచున్నది. ఆమె ఏలీయాతో –అయ్యా, తొట్టిలో కొంచెము పిండియు, బుడ్డిలో కొంచెము నూనెయు తప్ప నా దగ్గర మరేమియు లేదని, ఇదిగో మేము చావక ముందు నేను ఇంటికి పోయి; నాకును, నా బిడ్డకును ఆహారము సిద్ధపరచుకొనవలెనని పుల్లలు ఏరుకొనుటకు ఇటు వచ్చితినని చెప్పెను.

ఈ స్త్రీ దైవజనుని యొద్ద తన నిజస్థితిని ఒప్పుకొనుచున్నది. అనేకులు దేవుని సేవకుల యొద్ద కూడా తమ నిజస్థితిని ఒప్పుకొనక, తమ పాపములను

కప్పుకొనుచు గొప్పవారిగా చలామణి అవ్వాలని అనుకొందురు. ఏలీయా – ఆమెతో భయపడవద్దు, పోయి నీవు నేను చెప్పినట్లు చేయుము. అయితే అందులో చిన్న అప్పము చేసి, మొదట నాకు తీసుకొని రమ్ము; తరువాత నీకును, నీ బిడ్డకును అప్పము చేసుకొనుము. భూమీ మీద దేవుడు వర్షము కురిపించు వరకు ఆ తొట్టిలో ఉన్న పిండి తక్కువ కాదు, బుడ్డిలో ఉన్న నూనె అయిపోదు అని దీవించెను.

ఆ మాటను నమ్మిన ఆ విధవరాలు ఆలాగు చేయగా; ఆమెయు, ఆమె ఇంటివారును అనేక దినములు భోజనము చేయుచు వచ్చిరి. ఏమి తిందుమా, ఏమి త్రాగుదుమా అని మీరు అన్యజనుల వలె చింతించకుడి. ఆకాశ పక్షులను చూడుడి; అవి విత్తవు, కోయవు, కొట్లలో కూర్చుకొనవు. అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు. మీరు వాటి కంటె బహు శ్రేష్ఠులు కారా? కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి. అప్పుడు ఇవన్నీ మీకు అనుగ్రహించబడును (మత్తయి 6:31-33). లేమిలో కూడా ఆ విధవరాలు దేవుని నామములో వచ్చినవారికి మొదటి రొట్టెను చేసి యిచ్చెను. దానికి ప్రతిఫలంగా ఆమె, ఆమె ఇంటివారు కరవు కాలమంతా సమృద్ధిగా భోజనము చేసిరి.

ఈనానేకులు దేవుని మీద విశ్వాసముంచక, మనల్ని పోషించువాడు మన దేవుడేనని నమ్మక; తామేదో కష్టపడి సంపాదించుకోవాలని ఆశించుచున్నారు. ఆహారము కంటె ప్రాణమును, వస్త్రము కంటె శరీరమును ముఖ్యమని మరచు చున్నారు. ఈ సారెపతు విధవరాలు తనకున్న దానిలో కొంత మొదట దేవునికి అప్పగించినందున తనకు కలిగినది అంతా దీవించబడెను.

ప్రియ చదువరీ! నీ రాబడి అంతటిలో ప్రథమ ఫలము యిచ్చి యెహోవాను ఘనపరచుచున్నావా? (సామెతలు 3:9) దేవుడు ఆకాశపు వాకిళ్ళను విప్పి పట్టజాల నంత విస్తారముగా దీవెనలు కుమ్మరించునట్లు నీ దశమ భాగములు, కానుకలు ఆయన కిచ్చుచున్నావా? పరీక్షించుకొనుము! (మలాకీ 3:10).

నేడనేకమంది విశ్వాసులు కరవులోను, అప్పులలోను ఉండుటకు కారణ మేమి? భోజనము చేసినా ఆకలి తీరక, పానము చేసినను దాహము తీరక, ఎంతో కష్టపడి సంపాదించుకొనిన జీతము చిల్లిసంచిలో వేసినట్లు మిగలక పోవడానికి కారణమేమి? మనుష్యులు అన్నీ యిచ్చిన దేవుని మరచి, ఎన్నో సంపాదించుకోవాలని ఆశించుట వలననే గదా!

అయితే ఈ విధవరాలి విశ్వాసము చూడండి! ప్రతిరోజు తొట్టిలో చేయి పెట్టినప్పుడు పట్టెడు పిండి, బుడ్డిలో కొద్దిగా నూనె మాత్రమే ఉండెను. గాని తొట్టి నిండా పిండి, బుడ్డి నిండా నూనె కూడా లేదు. ప్రభువా! మా అనుదిన ఆహారము మాకు దయచేయమన్నట్లు, రేపటి గురించి చింతించకుడి అన్నట్లు ఆమె జీవించెను.

అరణ్యములో అనేక లక్షల మందిని అనుదినము ఆకాశపు మన్నాతో పోషించిన దేవుని యందు విశ్వాసము ఉంచెను. గనుక భూమి మీద వర్షము పడకుండినను, దేశమంతా మూడున్నర సంవత్సరములు కరవు ఉన్నను ఈమె సమృద్ధిగా భుజించెను.

ప్రియ చదువరీ! నీకున్న దానిని దేవుని చేతిలో పెట్టు! అది అనేక రెట్లు ఆశీర్వదించబడుతుంది. నీ విశ్వాసము దేవునియందు ఉంచు, నీవు ఎన్నడూ మోసపోవు!

ఒకరోజు అకస్మాత్తుగా ఈ విధవరాలి కుమారుడు రోగియై మరణించెను. వెంటనే ఈ విధవరాలు ఏలీయాతో–'దైవజనుడా, నీవు నా యొద్దకు రానిమిత్తమేమి? నా పాపము జ్ఞాపకము చేసి నా కుమారుని చంపుటకు వచ్చితివా?' అని కన్నీరు కార్చెను. ఈనాడనేకులు దైవజనులు మన గృహాలు దర్శించాలని, దీవించాలని; మన వ్యాధుల కొరకు, బాధల కొరకు ప్రార్థించాలని కోరుకొందురు. అలాగే చేర్చుకొని, ఆతిథ్యము యిచ్చి అనేక ఆశీర్వాదాలు పొంది ఉప్పొంగిపోవుదురు. అయితే ఒక నిజమైన దైవజనుడు మన యొద్దకు వచ్చినప్పుడు ఆశీర్వాదాలతో పాటు, పాపపు ఒప్పుకోలు కలుగవలెను.

ఏలీయా ఈ విధవరాలి ఇంట నుండుట వలన ఆయన సెలవిచ్చు దేవుని మాటలను బట్టి, ఏలీయా మాదిరి జీవితమును బట్టి ఈ విధవరాలు తాను పాపినని గ్రహించెను. తన పాప ఫలితమే తన బిడ్డ మీదికి వచ్చెనని గుర్తించగలిగెను. తల్లి దండ్రుల పాపములు బిడ్డల ఒడిలో పడునని గ్రహించి, తన పాపముల కొరకై పశ్చాత్తాపపడెను. ఈ సమయములో దేవుడే తన బిడ్డను బ్రతికించగలడని నమ్మి, ఆ బిడ్డను దైవజనునికి అప్పజెప్పెను. ఆ చిన్నవాని కొరకు ప్రార్థించగా, ఆ చిన్నవాని ప్రాణము మరల అతనిలోనికి వచ్చి బ్రతికెను (I రాజులు 17:21,22).

'నమ్ముట నీ వలననైతే నమ్మువానికి సమస్తము సాధ్యమని', 'నా యందు విశ్వాసముంచినవాడు చనిపోడు, చనిపోయినను బ్రతుకును' అన్నట్లు ఆ కుమారుడు బ్రతికెను. ఏలీయా ఆ బిడ్డను ఆ విధవరాలికి అప్పగించగా; 'నీవు దైవజనుడవనియు, నీవు పలుకుచున్న యెహోవా మాట నిజమని నేను ఎరుగుదును' అనెను. మొదట ఆమె దేవుని ఆశీర్వాదమును, ఆయన యిచ్చు ఆహారమును తిని తృప్తి పొందినది. కాని ఆమె ఇప్పుడు దేవుడు పాపములు క్షమించువాడని, రక్షణ యిచ్చువాడని, పునరుత్థాన జీవితం యిచ్చునని నమ్మెను.

దేవుని యొద్ద నుండి అనేక మేలులు పొందుచున్న ప్రియ సోదరా! సోదరీ! దేవుని ముఖకాంతిలో నీ రహస్య పాపములు చూచుకొనుచున్నావా? దేవునితో సహవాసము చేయగోరే నీవు, నీ పాపము ఒప్పుకొన్నావా? – యస్. జయపాల్

ధ్యానం :

# నా కుమారుడా....!

## (సామెతల గ్రంథము నుండి...)

★ **నా కుమారుడా,** నీ తండ్రి ఉపదేశము ఆలకింపుము నీ తల్లి చెప్పు బోధను త్రోసివేయకుము. (1:8)

★ **నా కుమారుడా,** పాపులు నిన్ను ప్రేరేపింపగా ఒప్పకుము. (1:10)

★ **నా కుమారుడా,** యెహోవా శిక్షను తృణీకరింపవద్దు ఆయన గద్దింపునకు విసుకవద్దు. (3:11)

★ **నా కుమారుడా,** నా ఉపదేశమును మరువకుము నా ఆజ్ఞలను హృదయపూర్వకముగా గైకొనుము. (3:1)

★ **నా కుమారుడా,** నీవు ఆలకించి నా మాటల నంగీకరించిన యెడల నీవు దీర్ఘాయుష్మంతుడవగుదువు. (4:10)

★ **నా కుమారుడా,** జార స్త్రీయందు నీవేల బద్ధుడవై యుందువు? పరస్త్రీ రొమ్ము నీవేల కౌగలించుకొందువు? (5:20)

★ **నా కుమారుడా,** నా జ్ఞానోపదేశము ఆలకింపుము వివేకము గల నా బోధకు చెవి యొగ్గుము. (4:20)

★ **నా కుమారుడా,** నీ తండ్రి ఆజ్ఞను గైకొనుము నీ తల్లి ఉపదేశమును త్రోసివేయకుము. (6:20)

★ **నా కుమారుడా,** నీ చెలికాని చేత నీవు చిక్కుబడితివి. నీవు త్వరపడి వెళ్లి విడిచిపెట్టుమని నీ చెలికానిని బలవంతము చేయుము. (6:3)

★ **నా కుమారుడా,** నా మాటలను మనస్సున నుంచుకొనుము నా ఆజ్ఞలను నీ యొద్ద దాచిపెట్టుకొనుము. (7:1)

★ **నా కుమారుడా,** తెలివి పుట్టించు మాటలు నీవు మీరగోరితివా? ఉపదేశము వినుట ఇక మానుకొనుము. (19:27)

★ **నా కుమారుడా,** నీ హృదయమును నాకిమ్ము నా మార్గములు నీ కన్నులకు ఇంపుగా నుండనిమ్ము. (23:26)

★ **నా కుమారుడా,** నీ హృదయమునకు జ్ఞానము లభించిన యెడల నా హృదయము కూడ సంతోషించును. (23:15)

★ **నా కుమారుడా,** నీవు విని జ్ఞానము తెచ్చుకొనుము నీ హృదయమును యథార్థమైన త్రోవల యందు చక్కగా నడిపించుకొనుము. (23:19)

★ **నా కుమారుడా,** జ్ఞానము సంపాదించి నా హృదయమును సంతోషపరచుము. అప్పుడు నన్ను నిందించువారితో నేను ధైర్యముగా మాటలాడుదును. (27:11)

# మెమొరీ కార్డ్స్

**ఇప్పుడు మీ సెల్‌ఫోన్‌లోనే దేవుని వాక్యమును, పాటలను చూడవచ్చు!**

నూతనంగా రూపొందించబడిన

| | | |
|---|---|---|
| ★ కల్వరి సునాద గీతములు | ఉజ్జీవింపజేసే 20 వీడియో పాటలు | |
| ★ కుటుంబమును కట్టు సత్యములు | శ్రేష్ఠమైన 35 వీడియో వర్తమానములు | |

మరియు గతంలో సిద్ధపరచిన

| | | |
|---|---|---|
| ★ సందేశాలు - సంగీతాలు | (ఆడియో/వీడియో) | 30 గం॥లు |
| ★ యెరూషలేము | (ఆడియో/వీడియో) | 30 గం॥లు |
| ★ మీకు తెలుసా? | (ఆడియో/వీడియో) | 30 గం॥లు |

**కలిగిన నాణ్యమైన 8 GB మెమొరీ కార్డ్‌లు సిద్ధముగా ఉన్నవి!**

**ఒక్కొక్క మెమొరీ కార్డ్‌కు విరాళము రూ. 1,000/-**

**ఈ ఐదు మెమొరీ కార్డ్‌లు పొందాలనుకొంటే కనీస విరాళము రూ. 2,000/- పంపండి!**

**రుసుమును మీరు Online ద్వారా గాని, M.O. ద్వారా గాని పంపవచ్చును!**

**అయితే మీ అడ్రస్, వివరములు తప్పక తెలియజేయండి!**

మరిన్ని వివరములకు సంప్రదించవలసిన నంబర్ – (0) 89 39 39 39 39

# ఎవరు తింటేనేమి?

'నరమాంస భక్షకుల మధ్యకు సువార్త ప్రకటించడానికి నేను వెళ్ళబోతున్నాను' అని జాన్ జి. పేటన్ చెప్పినప్పుడు, అనేకులు – 'ఎందుకయ్యా, నీ చక్కటి జీవితాన్ని వ్యర్థపరచుకొంటావ్? మంచి జ్ఞానము, బలము, స్ఫూర్తి ఉన్న నీవు పెద్ద పెద్ద పట్టణాలలో, మంచి మంచి ఆలయాలలో సేవ చేయొచ్చు కదా! ఆ నరమాంస భక్షకుల మధ్యకు వెళ్తే, వారు నిన్ను చూచిన వెంటనే కొరుక్కొని తినేస్తారు. అప్పుడు నీ జీవితం వృథా అయిపోతుంది' అన్నారు.

అందుకు జాన్ జి. పేటన్ 'నేను చనిపోయి సమాధిలో పెట్టబడినప్పుడు ఎలాగూ మట్టి పురుగులు నన్ను పీక్కొని తింటాయి. గనుక బ్రతికున్నప్పుడు ఆ నరమాంస భక్షకులు నన్ను పీక్కొని తింటే తిననీయండి. మట్టి పురుగులు నన్ను తినుట కంటె, క్రీస్తు కొరకు నరమాంస భక్షకులకు నేనాహారమైతే పోయిందేముంది? అయినా, నా కొరకు నలుగగొట్టబడి, తన రక్తమంతా కార్చిన క్రీస్తు కొరకు నేను చనిపోవటం ఒక త్యాగమేనా?' అన్నాడు. (లూకా 9:24) – **ఎడిటర్**

బైబిలులోని పదాలకు :

# అర్థాలు తెలుసుకొందాం!

(గత సంచిక తరువాయి...)

| | | | | |
|---|---|---|---|---|
| 101. | అబానా | = | రాళ్ళు గలది, స్థిరమైన కట్టడ | (II రాజులు 5:12) |
| 102. | అబారీము | = | అవతలి ప్రదేశములు, వాగులు | (సంఖ్యా 27:12) |
| 103. | అబ్దా | = | యెహోవా దాసుడు | (I రాజులు 4:6; నెహెమ్యా 11:17) |
| 104. | అబ్యాతారు | = | సమృద్ధికి తండ్రి | (I సమూ 22:20; II సమూ 8:17) |
| 105. | అబ్రాము | = | తండ్రి హెచ్చింపబడెను | (ఆది 11:26; I దిన 1:27) |
| 106. | అబ్రాహాము | = | అనేక జనములకు తండ్రి | (ఆది 17:5; లేవీయ 26:42) |
| 107. | అబ్షాలోము | = | సమాధానమునకు తండ్రి | (II సమూ 13:1; I రాజులు 1:6) |
| 108. | అబీయా | = | నా తండ్రి | (II దిన 29:1) |
| 109. | అబీగయీలు | = | సంతోషాస్పదము, ఆనందమునకు కారణము | (I సమూ 25:3) |
| 110. | అబీటలు | = | మంచు పుట్టించెడిది | (II సమూ 3:4; I దిన 3:3) |
| 111. | అబీదా | = | తండ్రి వివేకి, వివేకాస్పదము | (ఆది 25:4; I దిన 1:33) |
| 112 | అబీదాను | = | తండ్రి న్యాయాధిపతి, తీర్పుకు తండ్రి | (సంఖ్యా 1:11; 2:22) |
| 113. | అబీనాదాబు | = | తండ్రి దయగలవాడు | (I సమూ 7:1; I దిన 2:13) |
| 114. | అబీనోయము | = | మధురమైన తండ్రి | (న్యాయాధి 4:6; 5:1) |
| 115. | అబీమాయేలు | = | దేవుడే నా తండ్రి | (ఆది 10:28; I దిన 1:22) |
| 116. | అబీమెలెకు | = | రాజుకు తండ్రి | (ఆది 21:22; న్యాయాధి 8:31) |
| 117. | అబీయల్బోను | = | యెహోవా నా తండ్రి | (II సమూయేలు 23:31) |
| 118. | అబీయా | = | యెహోవా నా తండ్రి | (I సమూయేలు 8:2; I దిన 2:24) |
| 119. | అబీయాసాపు | = | తండ్రి సమకూర్చువాడు, కూటమునకు తండ్రి | (నిర్గమ 6:24) |
| 120. | అబీయెజెరు | = | తండ్రి యొక్క సహాయము | (న్యాయాధి 6:34) |

**(సశేషం)** - ఎడిటర్

# యెడతెగని ప్రార్థన ఎలా?

'యెడతెగక ప్రార్థించమంటున్నారు; ఇక పనులు, పాటవాలు చేసుకోవద్దా?' అని ఒకరన్నందుకు జార్జిముల్లర్ అనే ప్రార్థనాపరుడు–'నేనెల్లప్పుడూ ప్రార్థనాత్మ కలిగి జీవిస్తున్నాను. గనుక నేను నడుస్తున్నప్పుడు, కూర్చున్నప్పుడు; పండుకొన్నప్పుడు, లేస్తున్నప్పుడు; పనిచేస్తున్నప్పుడు కూడా ప్రార్థిస్తూనేయుంటాను. నా మనస్సులో ఉన్న ఊహలు, ఆలోచనలు కూడా దేవునితో సంభాషణ చేసుకొంటూ ఉంటాయి' అన్నాడు. (I థెస్స 5:17)

# ప్రార్థించండి! పాలిభాగస్థులవ్వండి!

ప్రభువు చిత్తములో ప్రారంభించిన టెలివిజన్ పరిచర్య మరియు గెట్-టుగెదర్‌లు కొనసాగించునట్లు ప్రార్థించండి!

ప్రతిరోజు తెలుగు, హిందీ, తమిళ భాషల కార్యక్రమాలతో పాటు ఇప్పడు మళయాళం, బెంగాలీ, ఇంగ్లీషు భాషలలో కూడా వారానికి ఒక కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నాము! అంతేగాక కన్నడ, పంజాబీ, మరాఠీ, ఉర్దూ మొదలైన మరికొన్ని భాషలలో టెలివిజన్ కార్యక్రమాలు త్వరలో ప్రారంభించాలని ప్రార్థిస్తున్నాము! ఇట్టి భారభరితమైన పరిచర్యలలో మీరును పాలిభాగస్థులగునట్లు ప్రభువు మిమ్మును ప్రేరేపించిన కొలది మీ విరాళములను, కానుకలను పంపించండి!

M.O. ద్వారా లేక D.D. ద్వారా లేక చెక్కు ద్వారా లేక **ఇప్పుడు అందరికీ అందుబాటులోనికి వచ్చిన Online Transaction ద్వారా మీ విరాళములు పంపించవచ్చు!**

| | | | |
|---|---|---|---|
| ANDHRA BANK | అకౌంట్ పేరు | : | JAYAPAUL FOUNDATIONS |
| | అకౌంట్ నంబరు | : | 20721110000229 |
| | బ్రాంచ్ | : | Kodambakkam, Chennai-24 |
| | I.F.S. కోడ్ | : | ANDB0002072 |
| State Bank of India | అకౌంట్ పేరు | : | JAYAPAUL FOUNDATIONS |
| | అకౌంట్ నంబరు | : | 30699437837 |
| | బ్రాంచ్ | : | Kodambakkam, Chennai-24 |
| | I.F.S. కోడ్ | : | SBIN0001444 |
| ICICI Bank | అకౌంట్ పేరు | : | JAYAPAUL FOUNDATIONS |
| | అకౌంట్ నంబరు | : | 021205006901 |
| | బ్రాంచ్ | : | Santhome, Chennai |
| | I.F.S. కోడ్ | : | ICIC0000212 |

మీకు అనుకూలమైన బ్యాంక్ ద్వారా మీ విరాళములు పంపండి! మీరు రుసుము పంపినప్పడు, ఆ విషయము మాకు ఫోన్ ద్వారా లేక SMS ద్వారా లేక e-mail ద్వారా లేక ఉత్తరము ద్వారా మీ పేరు, చిరునామా మరియు సెల్/ ఫోన్ నంబర్‌లతో సహా తప్పక తెలియజేయండి! **వివరములకు : (0) 89 39 39 39 39**

**మీ విరాళములను M.O., D.D., మరియు చెక్కుల ద్వారా పంపుటకు మా చిరునామా :**

| | |
|---|---|
| **జయపాల్ ఫౌండేషన్స్**<br>**29, న్యూ కాలనీ రోడ్,**<br>**వేలచ్చేరి,**<br>**చెన్నై - 600 042.** | **JAYAPAUL FOUNDATIONS**<br>**29, New Colony Road,**<br>**Velachery,**<br>**Chennai - 600 042.** |

*Published and Edited by* : **N. JAYAPAUL,** 105, Ramanayakan Street, Nungambakkam, Chennai - 600 034. Printed by : R. Veera Raghavulu at Padmalaya Printers, 8/17, Manali Road, Chennai - 600 021. *Editor* : **N. Jayapaul**

## మా కొరకు మీరు ప్రార్థిస్తున్నారా?

## "కల్వరి ఇవాంజలికల్ ఫెలోషిప్"

**(స్వతంత్ర, స్వచ్ఛంద, స్వదేశ విశ్వాస సేవ)**

## JAYAPAUL FOUNDATIONS

*I will build (Matt. 16:18)*

*Reach the unreached (Romans 15:20)*

| | |
|---|---|
| ★ మా గురి | - ఆత్మల సంపాదన |
| ★ మా నిధి | - దేవుని వాగ్దానములు |
| ★ మా భారం | - సువార్త ప్రకటన |
| ★ మా మూలం | - విశ్వాసము |
| ★ మా బలం | - ప్రేమ |
| ★ మా శిరస్సు | - క్రీస్తు ప్రభువు |
| ★ మా నిరీక్షణ | - క్రీస్తు రెండవ రాకడ |

**మా వాగ్దానములు**

| | |
|---|---|
| ★ సువార్త సేవ | - I సమూయేలు 22:2 |
| ★ ఉజ్జీవ సేవ | - యెషయా 55:4,5 |
| ★ రేడియో పరిచర్య | - రోమా 16:21 |
| ★ టి.వి. పరిచర్య | - రోమా 9:16 |
| ★ జయపాల్ ఫౌండేషన్స్ | - మత్తయి 16:18,19 |

## మీరు వీక్షిస్తున్నారా?

## "కల్వరి దర్శనం"

**(టి.వి. కార్యక్రమములు)**

| | | |
|---|---|---|
| మా మ్యూజిక్‌లో | ప్రతిరోజు | 6:30 am |
| శుభవార్తలో | ప్రతిరోజు | 7:00 pm |
| ఆరాధనలో | ప్రతిరోజు | 8:00 pm |
| శుభసందేశ్‌లో (హిందీ) | ప్రతిరోజు | 7:30 pm |
| నంబిక్కైలో (తమిళం) | ప్రతిరోజు | 8:00 pm |
| జీ బంగ్లాలో (బెంగాలీ) | శుక్రవారం | 6:30 am |
| హార్వెస్ట్‌లో (మలయాళం) | సోమవారం | 3:30 pm |

## మీరు చదువుతున్నారా?

**"కల్వరి ప్రేమధార"** ద్విమాస పత్రిక

మరియు **కల్వరి ప్రచురణలు**

Dr.N. జయపాల్ గారిచే రచించబడిన

50 ఆధ్యాత్మిక పుస్తకములు!

ఇంకా అనేక పాటలు, ప్రసంగముల CDలు, DVDలు మరియు మెమొరీ కార్డ్స్, పెన్‌డ్రైవ్స్ కూడా లభ్యమగును!


వివరములకు సంప్రదించండి!

**JAYAPAUL FOUNDATIONS**
**29, NEW COLONY ROAD**
**VELACHERY, CHENNAI-600 042.**

*Contact No.s:*

**(0) 89 39 39 39 39, (0) 98847 07779**


# ఇప్పుడు సువార్తను ప్రకటించవలసిన అవసరత!

"మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి" (మార్కు 16:15) అన్న ఆజ్ఞను ప్రభువిచ్చినప్పుడు, అప్పటి ప్రపంచ జనాభా ఇంచుమించు 300 మిలియన్లు మాత్రమే!

అయితే క్రీ.శ. 1650వ సంవత్సరము నకు ప్రపంచ జనాభా 600 మిలియన్లు అయినది. మరియు క్రీ.శ. 1835కి 1 బిలియన్ (1000 మిలియన్లు) అవ్వగా, క్రీ.శ. 1935కి 2 బిలియన్లు అయ్యారు.

నేటికి అనగా 2017 నాటికి ప్రపంచ జనాభా ఇంచుమించు 7.5 బిలియన్లు (7,500 మిలియన్లు) అని అంచనా! మన రెండు తెలుగు రాష్ట్రాల మొత్తం జనాభా 8.94 కోట్లు అని ప్రస్తుత అంచనా!

అయితే వీరిలో ఇంకా అనేకులు సువార్త వినలేదు, రక్షించబడలేదు. కాబట్టి మునుపటి కంటె ఇప్పుడే సువార్త ప్రకటించవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది!

గనుక "సువార్తను ప్రకటింపవలసిన భారము నా మీద మోపబడి యున్నది. అయ్యో, నేను సువార్తను ప్రకటింపక పోయిన యెడల నాకు శ్రమ" (I కొరింథీ 9:16) అన్న పౌలు వలె సువార్త సేవలో ముందుకు సాగుదాం!

అప్పుడు "క్రీస్తు నామ మెరుగని చోట్లను సువార్తను ప్రకటింపవలెనని మిక్కిలి ఆశ గలవాడనై యుండి ఆలాగున ప్రకటించి తిని" (రోమా 15:21) అని చెప్పగలుగుదుము!

**- యన్. జయపాల్**

# కల్వరి దర్శనం టి.వి కార్యక్రమాలు వీక్షిస్తున్నారా!

ప్రతి రోజు ఉదయం 6:30 గం॥లకు
**మా మ్యూజిక్‌లో**

ప్ర తి రో జు

శుభవార్త టి.వి.లో రాత్రి 7.00 గం॥లకు
(వీడియోకాన్ -746, టాటాస్కై -771, రిలయన్స్ - 733, డిష్ టి.వి - 934, సన్-714, ఎయిర్‌టెల్ - 531)

ఆరాధన టి.వి.లో రాత్రి 8.00 గం॥లకు
ప్రతిరోజు రాత్రి (Mid Night) 12.30 ని॥లకు (రిలయన్స్ - 734)
(వీడియోకాన్ -742, టాటాస్కై -1463, రిలయన్స్ - 734, ఎయిర్‌టెల్ - 944)

శుభసందేశ్ (హిందీ) టి.విలో రాత్రి 7.30 గం॥లకు

నంబిక్కై (తమిళ్) టి.విలో రాత్రి 8.00 గం॥లకు
(వీడియోకాన్ -578, టాటాస్కై -1575, రిలయన్స్ - 660, ఎయిర్‌టెల్ - 817)

జీ బంగ్లాలో (బెంగాలి)
ప్రతి శుక్రవారం సా॥ 6:30 నుండి 7:00 గం॥ల వరకు

హార్వెస్ట్ ఛానల్‌లో (మలయాళం)
ప్రతి సోమవారం మ॥ 3:30 నుండి 4 గం॥ల వరకు
(ఎయిర్‌టెల్ - 872)

తప్పక వీక్షించండి! మీ సహకారం అందించండి!!




Calvary Premadhara (Bi-monthly) July - August 2017
Registered with Registrar of News Papers India, Under No: 69868/98